సోమవారం
02-09-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 73
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నీటమునిగిన సింగ్‌నగర్

మరో రెండు రోజులు భారీ వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ఏపీలో మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని విశాఖ తుపాన్ హెచ్చరికల కేంద్రం హెచ్చరించింది. రాయలసీమ, దక్షిణకోస్తాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ ప్రకటించారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం వాయువ్య దిశగా కదులుతూ ఉత్తరకొస్తా, దక్షిణ ఒడిశా, చత్తీస్‌గఢ్ ప్రాంతాలను ఆనుకొని కొనసాగుతోందని చెప్పారు. ఇది క్రమంగా బలహీనపడి తీవ్ర అల్పపీడనంగా కొనసాగుతోంది. వాయుగుండం

- మిగతా 2 లో

ఆగస్టులో జీఎస్టీ వసూళ్లు రూ.1.75 లక్షల కోట్లు

న్యూదిల్లీ: దేశంలో గత నెలకు సంబంధించిన వస్తు, సేవల పన్ను వసూళ్ల వివరాలను కేంద్రం వెల్లడించింది. ఆగస్టు మాసానికి రూ.1.75 లక్షల కోట్లు వసూళ్లు జరిగినట్లు పేర్కొంది. గతేడాది ఇదే నెలలో రూ.1.59 లక్షల కోట్ల వసూళ్లు నమోదవ్వగా.. అప్పటితో పోలిస్తే ఈసారి 10 శాతం మేర పెరగడం గమనార్హం. జులై మాసంలో రూ.1.82లక్షల కోట్ల మేర జీఎస్టీ వసూళ్లు వచ్చాయని తెలిపింది. ఆగస్టులో దేశీయ వ్యాపార కార్యకలాపాల ద్వారా స్థూల జీఎస్‌టీ వసూళ్లు 9.2శాతం పెరిగి రూ.1.25 లక్షల కోట్లకు చేరాయి. దిగుమతుల ద్వారా జీఎస్‌టీ ఆదాయం 12.1శాతం మేర పెరగడంతో రూ.49,976 కోట్లకు చేరింది.

ప్రపంచ పవర్ లిఫ్టింగ్‌లో భారత్ జయకేతనం

మాల్టా: ప్రపంచ ఎక్విప్‌డ్ జూనియర్, సబ్ జూనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భారత్ విజయకేతనం ఎగురవేసింది. మాల్టాలో జరుగుతున్న ఈ పోటీల్లో జూనియర్ పురుషుల టీమ్ ఛాంపియన్‌షిప్‌ను భారత్ తొలిసారి సొంతం చేసుకుంది. మూడు బంగారు పతకాలు చేజిక్కించుకొని 49 పాయింట్లతో టీమ్ ఛాంపియన్‌గా అగ్రస్థానంలో నిలిచింది. 40 పాయింట్లతో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అంటే, అంతా గ్రాఫిక్సా మళ్ళీ, కొంపదీసి!

జలదిగ్బంధం

బెజవాడను ముంచిన బుడమేరు

గంటగంటకు పెరుగుతున్న వరద ఉధృతి

సాయం కోసం జనం ఎదురుచూపులు

రెండు దశాబ్దాల తర్వాత బుడమేరు వరదలో విజయవాడ నగరం మొత్తం మునిగిపోయింది. ఎన్‌టీఆర్ జిల్లా జీ కొండూరు మండలం వెలగలేరు వద్ద బుడమేరు రెగ్యులేటర్ సామర్థ్యాన్ని మించి వరద రావడంతో బుడమేరు పొంగి విజయవాడ నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాలను జలదిగ్బంధనం చేసింది. గంట గంటకు వరద ఉధృతి పెరుగుతుండటంతో ఇళ్లన్నీ నీట మునిగిపోతున్నాయి.

2లో

ప్రకాశం బ్యారేజీకి 10 లక్షల క్యూసెక్కులు

మొత్తం 70 గేట్లు ఎత్తి సముద్రంలోకి వరద నీటి విడుదల

2009 తర్వాత రికార్డుస్థాయిలో వరద రావడం ఇదే తొలిసారి

2లో

వరద బీభత్సం

- 14 జిల్లాల్లో వరి, ఉద్యాన పంటల నీట మునక
- హైదరాబాద్ వైపు రాకపోకలు బంద్
- నేడు విద్యా సంస్థలకు సెలవు
- ముంపు ప్రాంతాలపై సీఎం చంద్రబాబు సమీక్ష
- కొండచరియలు విరిగిన ప్రాంతంలో సీపీఐ నేత రామకృష్ణ పర్యటన

2లో

బుడమేరు ఉధృతికి జలమయమైన సింగ్‌నగర్

పీకల్లోతు వరదలో బాధితులు

ప్రతి ఒక్కరికీ న్యాయం

బుడమేరుపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం: చంద్రబాబు

6లో

మోదీ... ఆ హక్కు నీకెక్కడిది

- విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు
- నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు 23న బ్లాక్ డే
- ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో అమర్‌జిత్ కౌర్

విశాలాంధ్రబ్యూరో- విశాఖపట్నం: ఆంధ్రుల హక్కు..విశాఖ ఉక్కు అన్న నినాదంతో ఎంతో మంది బలిదానాలతో ఏర్పాటైన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించే హక్కు నరేంద్ర మోదీకి ఎవరు ఇచ్చారని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ నిలదీశారు. విశాఖలోని గురజాడ కళాక్షేత్రం (కామ్రేడ్ వీవీ రామారావు సభా ప్రాంగణం)లో మూడు రోజుల పాటు జరిగే ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఆదివారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ఏఐటీయూసి పతాకాన్ని జాతీయ అధ్యక్షులు రామేంద్రకుమార్ ఆవిష్కరించారు. తదుపరి అమరవీరుల స్తూపం వద్ద జాతీయ, రాష్ట్ర నేతలంతా వరుసగా నివాళులర్పించారు. సంతాప తీర్మానాన్ని ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి గిరి ప్రవేశపెట్టారు. ఇటీవల అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన కార్మికులకు సంతాపం తెలుపుతూ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఆహ్వాన సంఘ అధ్యక్షుడు జీఎస్ జే అచ్యుతరావు స్వాగతోపన్యాసం చేశారు. రామేంద్రకుమార్, అయిదుగురు జాతీయ ఉపాధ్యక్షులు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. అమర్‌జిత్ కౌర్ ప్రసంగాన్ని కొనసాగిస్తూ, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. మోదీ హయాంలో దేశంలో అన్ని వ్యవస్థలు దెబ్బతిన్నాయని, ఆర్థిక వ్యవస్థ కుదేలయిందని విమర్శించారు. యువతను నిరుద్యోగ సమస్య పట్టిపీడిస్తుండగా, మోదీ మాత్రం 8 కోట్ల ఉద్యోగాలు సృష్టించామని నిరాధార వాదనలు చేస్తున్నారన్నారు. ఇటీవల సెంట్రల్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమి తాజా డేటా ప్రకారం 20, 24 ఏళ్ల వయసు వారి నిరుద్యోగ రేటు 40 శాతం కంటే ఎక్కువగా ఉండటమే ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. మోదీ కార్పొరేట్‌లకు కొమ్ముకాస్తూ ప్రభుత్వరంగ సంస్థలను, ప్రకృతి వనరులను దోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కేంద్రంలో మోదీ నాయకత్వంలో మైనారిటీ, బలహీన ప్రభుత్వం నడుస్తున్నదన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మద్దతుతో కేంద్రంలో మోదీ మనుగడ సాగిస్తున్నారని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం 30వేలకుపైగా ఎకరాలను ప్రజలు ఇచ్చిన , 36 మంది ప్రాణ త్యాగం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అనేది ఆంధ్రుల సెంటిమెంట్ అన్నారు. మోదీ సర్కార్‌ను నిలబెడుతున్న సీఎం చంద్రబాబు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకోవాలన్నారు. రాష్ట్రానికి ప్యాకేజీ కావాలని డిమాండ్ చేసిన చంద్రబాబు, కీలకమైన విశాఖ ప్రైవేటీకరణ అంశంపై ఎందుకు మాట్లాడలేదని అమర్‌జిత్ కౌర్ ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కు క్యాప్టివ్ మైన్స్ కేటాయించి ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రానిదేనని స్పష్టం చేశారు. నష్టాలను సాకుగా చూపి ప్రభుత్వ రంగం సంస్థలను ప్రైవేట్‌పరం చేయడం దుర్మార్గమని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ బలోపేతం అయ్యేందుకు కేంద్రం దుక్కు ఇనుము గనులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కౌన్సిల్ సమావేశంలోనే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రత్యేకంగా తీర్మానం చేయనున్నట్లు వెల్లడించారు. బీజేపీ పాలిత గుజరాత్‌తో సహా అనేక రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. రెజర్ల సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులపై రెజర్లు పెద్ద ఎత్తున ఆందోళన చేసినా కనీసం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. మణిపూర్‌లో అరాచకాలపై మోదీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బాధితులను పరామర్శించే తీరిక కూడా లేదా అని నిలదీశారు. దీనిని బట్టి ఆయన దేశ ప్రజలకు ఏమి సందేశం ఇస్తున్నారని మండిపడ్డారు. మహిళలకు ఇళ్లలోనూ, రోడ్డు మీద, పని ప్రదేశాల్లోనూ రక్షణ లేని పరిస్థితులు కనబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్ సమయంలో మోదీ సర్కార్ మూడు ప్రజా, రైతు వ్యతిరేక చట్టాలను చేసిందని, 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని, కార్మిక సంఘాలతో సరైన సంప్రదింపులు లేకుండా, ప్రతిపక్ష పార్టీ ఎంపీలు గైర్హాజరు అయినప్పుడు ఏకపక్షంగా వాయిస్ ఓటు ద్వారా కార్మిక

- మిగతా 2 లో

కొండచరియ బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

- వరద బాధితులకు పునరావాసం కల్పించాలి
- ఇళ్లు, సామాగ్రి కోల్పోయిన వారికి సాయమందించాలి
- రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : విజయవాడ మొగల్రాజపురంలో కొండచరియలు విరిగిపడిన సంఘటనలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

- మిగతా 2 లో

రైతు రుణాలు మాఫీచేయాలి

- రైతు సంఘం నేతల డిమాండ్
- రాష్ట్రవ్యాప్తంగా కోర్కెల దినం పాటింపు

రైతు రుణ విమోచనచట్టం తీసుకురావాలనీ, రైతుల రుణాలన్నింటిని ఒక పర్యాయం మాఫీ చేయాలనీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు 50 శాతం గిట్టుబాటు ధరకు అదనంగా కలిపి మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యాన ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం కోర్కెల దినాన్ని పాటించారు.

6లో

రష్యా హెలికాప్టర్ కథ విషాదాంతం

మాస్కో: రష్యా తూర్పు ప్రాంతంలో 22 మందితో ప్రయాణిస్తూ అదృశ్యమైన హెలికాప్టర్ కథ విషాదాంతమైంది. అది కూలిపోయినట్లు అధికారులు ప్రకటించారు. చివరిసారి సంకేతాలు వచ్చిన ప్రాంతానికి సమీపంలో 900 మీటర్ల ఎత్తైన ప్రదేశంలో హెలికాప్టర్ శకలాలను గుర్తించినట్లు వెల్లడించారు. అందరూ చనిపోయినట్లు భావిస్తున్నా మని, ఇప్పటి వరకు 17 మంది మృతదేహాలు వెలికితీసినట్లు తెలిపారు. మిగతా ఐదుగురి కోసం అన్వేషణ కొనసాగుతున్నట్లు చెప్పారు. ఎంఐ-8 శ్రేణికి చెందిన ఈ హెలికాప్టర్... ముగ్గురు సిబ్బంది, 19 ప్రయాణికులతో కమ్‌చత్కా ద్వీపకల్పంలోని వచ్కజెట్స్ అగ్ని పర్వతం సమీపం నుంచి బయల్దేరింది. కానీ, గమ్యస్థానానికి చేరలేదని రష్యా ఫెడరల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీ ధ్రువీకరించింది. వచ్కజెట్స్ సమీపంలో రాడార్ నుంచి మాయమైంది. దీంతో గాలింపు చర్యల కోసం సహాయక సిబ్బంది రంగంలోకి దిగారు. హెలికాప్టర్ శకలాలు గుర్తించారు.

మరో రెండు రోజులు భారీ వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

పశ్చిమ వాయువ్య దిశగా కదులుతోంది. ఒడిశా మల్కన్‌గిరికి ఈశాన్యంగా 70 కిలోమీటర్లు, విశాఖకు 150 కిలోమీటర్లు, కళింగపట్నానికి 190 కిలోమీటర్లు, రామగుండానికి 310 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని వివరించారు. వాయుగుండం ప్రభావంతో మరో 24 గంటలపాటు దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. కొన్నిచోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అప్రమత్తం చేశారు. పల్నాడు, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు విశాఖ వాతావరణ కేంద్రం రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఏలూరు, కృష్ణా, బాపట్ల జిల్లాలకు ఆరంజ్ అలర్ట్ జారీ చేసింది. తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, అత్యధికంగా 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని అధికారి శ్రీనివాస్ వివరించారు. మత్స్యకారులు సముద్ర వేటకు వెళ్లకూడదని వాతావరణ శాఖ సూచించింది. మరోవైపు గడచిన 24 గంటల్లో అన్ని జిల్లాల్లో వర్షాలు కురిశాయి. అమరావతిలో అత్యధికంగా 26 సెంటీమీటర్లు, తిరువూరులో 26 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గుంటూరు 23 సెంటీమీటర్లు, ఏలూరు జిల్లాలోని కుక్కునూరులో 20 సెంటీమీటర్లు, అచ్చంపేటలో 19 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని శ్రీనివాస్ వెల్లడించారు.

కిమ్‌కు పుతిన్ రిటర్న్ గిఫ్ట్

24 మేలిమి జాతి గుర్రాల అందజేత

సియోల్: ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌కు మేలిమి జాతికి చెందిన 24 గుర్రాలను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బహుమతిగా ఇచ్చారు. ఉక్రెయిన్‌తో యుద్ధం వేళ ఉత్తర కొరియా నుంచి ఆయుధాలు సరఫరా చేసినందుకు కృతజ్ఞతగా ఈ బహుమతి పంపినట్లు స్థానిక మీడియా కథనాలు ప్రచురించింది. కొన్ని రోజుల క్రితం పుతిన్ ఉత్తర కొరియాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆ దేశ నియంత కిమ్‌తో కొన్ని ద్వైపాక్షిక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. పాశ్చాత్య దేశాల నుంచి తమ రెండు దేశాల్లో ఎవరిపై దాడి జరిగినా పరస్పర సహాయం చేసుకుంటామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతున్న సమయంలో రష్యాకు సాయంగా ఆయుధాలు పంపించారు. దీనికి బదులుగా ఈ గుర్రాలను పుతిన్ పంపించినట్లు తెలుస్తోంది. ఓర్లోవ్ ట్రోటర్ జాతికి చెందిన 19 స్టాలియన్లు, ఐదు మరో జాతి గుర్రాలను రష్యా పంపించింది. ఈ జాతి గుర్రాలంటే కిమ్‌కు ఎంతో ఇష్టం. ఈ జాతి గుర్రాలను ఉత్తర కొరియా వారసత్వానికి ప్రతీకలుగా భావిస్తారు. గతంలో ట్రోటర్ గుర్రంపై కిమ్ స్వారీ చేసిన చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గతంలోనూ రెండు దేశాల అధినేతలు ఒకరికొకరు బహుమతులు ఇచ్చుకున్నారు. పంగ్సన్ అనే తెల్లటి వేటాడే శునకాలను పుతిన్‌కు కిమ్ కానుకగా ఇచ్చారు. అందుకు... రష్యా అధ్యక్షుడు కూడా ఆరుస్ లిమోసిన్ కారు బహుకరించారు. ఇద్దరు దేశాధినేతలు ఆ కారులో కొద్దిసేపు షికారు చేశారు. ఆ తర్వాత కిమ్‌కు 447 మేకలు ఇచ్చారు.

ట్రంప్ రాజకీయ గిమ్మిక్కులు: కమలా హారిస్

వాషింగ్టన్: అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అభ్యర్థులు పరస్పర విమర్శల వేగం పెంచారు. ఇటీవల ఆర్లింగ్టన్ నేషనల్ శ్మశానవాటికలో జరిగిన ఓ కార్యక్రమానికి ట్రంప్ హాజరయ్యారు. ఆ సమయంలో ట్రంప్ ప్రచార సిబ్బందికి, శ్మశానవాటికలోని రక్షణ అధికారుల మధ్య వాగ్వాదం ఏర్పడింది.

అయితే అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాజకీయ గిమ్మిక్కులు చేస్తున్నారని, పవిత్రమైన భూమిని అగౌరవపరుస్తున్నారని కమల హారిస్ విమర్శించారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ట్రంప్ ప్రచార సహాయకులు శ్మశానవాటిక సిబ్బందితో వాగ్వాదం సృష్టించారన్నారు. ఆ ప్రదేశాన్ని తాము ఎంతో గౌరవిస్తామన్నారు. అది రాజకీయ ప్రచారాలు చేసుకునే ప్రదేశం కాదని వ్యాఖ్యానించారు. ప్రతిష్ఠాత్మకమైన దేశ స్వాతంత్ర్యం కోసం అశువులు బాసిన వీరులందరి త్యాగాలను తాను ఎల్లప్పుడూ గౌరవిస్తానన్నారు. దీన్ని తాను ఎప్పుడూ రాజకీయం చేయనని హారిస్ పేర్కొన్నారు. శ్మశానవాటికలో ట్రంప్ ఫొటోలు తీయటాన్ని ఆమె ఖండించారు. 2021 ఆగస్టు 26న హమీద్ కర్జాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగిన బాంబు దాడిలో 13 మంది యూఎస్ సర్వీస్ సభ్యులు, 100 మందికి పైగా అఫ్గాన్‌లు మృతి చెందారు. మృతి చెందిన యూఎస్ సర్వీస్ సభ్యులకు నివాళులర్పించేందుకు బాధిత కుటుంబసభ్యుల ఆహ్వానం మేరకు ట్రంప్ అక్కడకు వెళ్లారు. అయితే కార్యక్రమ సమయంలో ట్రంప్ ప్రచార సిబ్బంది మాజీ అధ్యక్షుడి ఫొటోలు తీయడాన్ని రక్షణ అధికారులు ఖండించారు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

జలదిగ్బంధం

విజయవాడ - హైదరాబాద్ రహదారిపై గరికపాడు వద్ద వరద ఉధృతి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రెండు దశాబ్దాల తర్వాత బుడమేరు వరదలో విజయవాడ నగరం మొత్తం మునిగిపోయింది. ఎన్‌టీఆర్ జిల్లా జీ కొండూరు మండలం వెలగలేరు వద్ద బుడమేరు రెగ్యులేటర్ సామర్థ్యాన్ని మించి వరద రావడంతో బుడమేరు పొంగి విజయవాడ నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాలను జలదగ్బంధనం చేసింది. గంట గంటకు వరద ఉధృతి పెరుగుతుండటంతో ఇళ్లన్నీ నీట మునిగిపోతున్నాయి. జనం సాయం కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, పోలీసు సిబ్బంది పడవల ద్వారా ముంపు ప్రాంతాల్లో చిక్కుకున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. నగరంలోని పాతబస్తీ, వించిపేట్, చిట్టినగర్, భవానీపురం, విద్యాధరపురం, లోబ్రిడ్జి, చిట్టినగర్ టన్నెల్‌తోపాటు పాయకాపురం, అజిత్‌సింగ్ నగర్, కండ్రిక కాలనీ, దేవీనగర్, జక్కంపూడి కాలనీ తదితర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఫలితంగా నగర శివారు ప్రాంతాల నుంచి విజయవాడలోని రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. బుడమేరు వరద నీరు విజయవాడ - నూజివీడు ఆర్ అండ్ బీ రహదారి మీదగా మనిషి లోతున ప్రవహించడంతో జిల్లా యంత్రాంగం వాహనాల రాకపోకలను నిలిపివేసింది. ఇదిలావుండగా, సింగ్‌నగర్ ప్రాంతాల్లోని వేలాది కుటుంబాలు బుడమేరు ముంపులోనే ఉండిపోయాయి. కాగా, ముంపు ప్రాంత ప్రజలను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. బుడమేరు డ్రెయిన్ వరద నీరు ఈ రహదారిపైకి చేరి నున్న - గుణదల రోడ్డులోకి చేరడంతో, నున్న వైపు నుంచి విజయవాడ నగరంలోకి రావాలంటే నేషనల్ హైవే బైపాస్ మీదగా గన్నవరం వెళ్లి రావాల్సిన పరిస్థితి నెలకొంది.

శుక్రవారం నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఈలప్రోలు వద్ద రెండు చోట్ల బుడమేరుకు గండి పడింది. అక్కడి నుంచి నీరు పోలవరం కాలువలోకి భారీగా చేరి పొంగి ప్రవహిస్తోంది. కవులూరు శాంతినగర్ వద్ద మూడు చోట్ల బుడమేరుకు గండిపడింది. దీంతో శనివారం అర్ధరాత్రి ఒంటి గంట నుంచి వరద జక్కంపూడి, అంబాపురం గ్రామాలను ముంచేసింది. ఆ తర్వాత గంటగంటకు వరద పెరుగుతూ నగరంలోని వివిధ ప్రాంతాలను ముంచెత్తింది. భవానీపురం హెచ్‌బీ కాలనీ, ఐరన్ యార్డ్ నుంచి ఊర్మిళానగర్, కబేళా, సితార సెంటర్, చనుమోలు వెంకట్రావు ఫ్లై ఓవర్ దిగువ ప్రాంతం, వైఎస్సార్ సర్కిల్, కొత్త రాజరాజేశ్వరి పేట, రామకృష్ణాపురం, సింగ్ నగర్, పాయకాపురం, ప్రకాశ్ నగర్ నుంచి నున్న పవర్ గ్రిడ్ ప్రాంతం వరకు భారీగా వరద నీరు చేరింది. ఇళ్లన్నీ నీళ్లలోమునిగిపోయాయి. శనివారం అర్ధరాత్రి నుంచి ఆయా ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేశారు. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. తాగు నీటి కోసం సైతం అల్లాడే పరిస్థితి నెలకొంది. అంబాపురం, కొత్త ఆర్ఆర్ పేటలో వరద ఉధృతి తీవ్రంగా ఉంది. అపార్టుమెంట్లలో మొదటి అంతస్తు వరకు మునిగిపోయాయి. ఆదివారం ఉదయం ఉపద్రంలా విరుచుకుపడిన వరదనీరుకు అంబాపురం నుంచి పాత రాజరాజేశ్వరి పేట, చిట్టినగర్, కేఎల్ రావునగర్, వించిపేట నుంచి పంజా సెంటర్ వరకు ఇళ్లు అన్నీ నీటిలో మునిగిపోయాయి. ఉగ్రరూపం దాల్చినట్టు చిరుచీకటిలో వరదనీరు తలుపుతట్టి ఇంట్లోకి ప్రవేశించడంతో చిన్నా పెద్ద ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఏం జరుగుతోందో తెలియక అయోమయానికి గురయ్యారు. తేరుకునేలోపే బెడ్‌రూమ్‌లోకి అడుగుమేర నీరు చేరడంతో గందరగోళానికి గురయ్యారు. కట్టుబట్టలతో డాబాపైకి చేరుకుని ఆందోళనతో ఆరాతీయడం మొదలుపెట్టారు. క్షణక్షణం నీటి ఉధృతి పెరుగుతుండంతో కొందరు నగరంలో తమ బంధువుల ఇళ్లకు బయలుదేరారు. ఉదయం 6 గంటలకు ఇళ్లను తాకిన నీరు చూస్తూండగానే కాలనీలను చుట్టుముట్టింది. రూరల్ మండలం అంబాపురం, కండ్రిక, రాజీవ్‌నగర్, నైనవరం, పాతపాడు, మామిడికాయల మార్కెట్, నగరంలో వాంబేకాలనీ, శాంతినగర్, సింగ్‌నగర్, ఇందిరానాయక్‌నగర్, ఆంధ్రప్రభ కాలనీల్లో ఇళ్లు పూర్తిస్థాయిలో నీటమునిగాయి. కొందరు సామాన్లు సర్దుకుని సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారు. స్పందించిన అధికారులు అనేక కాలనీల ప్రజలను ట్రాక్టర్లు, లారీలపై పునరావాస కేంద్రాలకు తరలించారు. పోలీసులు బందోబస్తు నిర్వహిస్తూ వరదనీరు ప్రవాహంలో ప్రమాదభరితంగా మారిన రహదారులను దిగ్బంధం చేశారు. వాహనదారులు, పాదచారులను వెళ్లకుండా నియంత్రించారు. వివిధ ప్రాంతాల్లో నీటి ప్రవాహానికి ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. ప్రయాణీకులు కొందరు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రమాదం నుంచి బయటపడ్డారు. సింగ్‌నగర్- నున్న రహదారిలో ఉదయం నీటి ఉధృతికి ముగ్గురు గల్లంతైనట్లు తెలిసింది. ఇదిలా ఉండగా పూర్తి సమాచారం రాబట్టేందుకు అంబాపురం ఈవోని ఉదయం కొందరు ఫోన్ ద్వారా సంప్రదించగా... డీపీవో ఇతర ఉన్నతాధికారులు వచ్చి పరిశీలించినట్టు చెప్పారు. వరదనీరు ఉధృతికి ఎగువ నుంచి వస్తున్న నీరే ప్రధాన కారణమని తెలిపారు. వరద ముంపుప్రాంతాల్లో అధికారులు పడవలపై తిరుగుతూ సహాయక చర్యలు చేపట్టారు.

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అలియాస్ చిన్ని, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు జిల్లా యంత్రాంగంతో కలిసి వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో సహాయక చర్యలను పరిశీలించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన, పోలీస్ కమిషనర్ ఎస్ వి రాజశేఖర్ బాబు ఇతర జిల్లా స్థాయి అధికారులు నగరంలో వరదలను పర్యవేక్షిస్తున్నారు.

విజయవాడ సింగ్‌నగర్‌లో ట్రాక్టర్ ద్వారా వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న సహాయ సిబ్బంది

వరద బీభత్సం

రాయనపాడు రైల్వేస్టేషన్ వద్ద...


తెలంగాణలోని కేసముద్రం వద్ద దెబ్బతిన్న రైల్వే ట్రాక్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారీ వర్షాలు, వరదలతో వివిధ జిల్లాలు అతలాకుతలమయ్యాయి. మూడు రోజుల నుంచి పడుతున్న భారీ వర్షాలతో ఎటు చూసినా వర్షపు నీటితో నిండిపోయాయి. జలాశయాలకు వరద నీరు పోటెత్తి నిండుకుండగా మారాయి. బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీరం దాటడం, దాని ప్రభావంతో ఆది, సోమ వారాల్లో కోస్తాంధ్రకు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. పల్నాడు, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం జిల్లాలను రెడ్ ఎలర్ట్‌గాను, కృష్ణా, బాపట్ల జిల్లాలను ఆరెంజ్ ఎలర్ట్‌గా ప్రకటించారు. విస్తారంగా వర్షాలతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈదురు గాలులతో చాలా చోట్ల విద్యుత్ తీగెలు తెగిపోయి, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇబ్రహీంపట్నం వీటీపీఎస్‌లో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలిగింది. బొగ్గు మొత్తం తడచిపోవడం వల్ల విద్యుత్ ఉత్పత్తికి 48 గంటల నుంచి 72 గంటల సమయం పట్టే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. విజయవాడ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే 30 రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. జాతీయ రహదారులు, బస్‌స్టేషన్‌లు, పోలీస్ స్టేషన్‌లు, ప్రభుత్వ కార్యాలయాల్లోకి వర్షపు నీరు ముంచెత్తింది. తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రాయనపాడు వద్ద నిలిచిపోయింది. అక్కడి నుంచి బస్సుల ద్వారా విజయవాడకు ప్రయాణీకులను తరలించారు. వివిధ ప్రవేశ పరీక్షలు, పరీక్షలను వాయిదా వేశారు. వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలకు ప్రభుత్వం సన్నద్ధమైంది. సోమవారం తూర్పుగోదావరిజిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు, విద్యా సంస్థలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు. వర్షం కారణంగా భారీగా ఆస్తి, పంట నష్టం వాటిల్లింది. వివిధ ప్రాంతాల్లో ఇప్పటి వరకు 9 మంది మరణించినట్లు హోంమంత్రి అనిత ధ్రువీకరించారు. ప్రస్తుత సమచారం మేరకు 14 జిల్లాల్లో 62,644 హెక్టార్లలో వరి పంట నీట మునిగింది. మరో 7218 హెక్టార్లలో ఉద్యానవన పంటలు నీట మునిగినట్లు ప్రభుత్వం తెలిపింది. గుంటూరు, విజయవాడ, మచిలీపట్నం తదితర ప్రాంతాలలో ఆర్టీసీ బస్‌స్టేషన్లలోకి భారీగా నీరు చేరింది. విజయవాడ-హైదరాబాద్ 65వ నంబరు జాతీయ రహదారిపైకి వరద నీరు వచ్చి చేరింది. కంచికచర్ల మండలం పరిటాల గ్రామ చెరువుకి గండి పడటంతో గ్రామంలోకి వరద నీరు వస్తోంది. దీంతో విజయవాడ-హైదరాబాద్ మధ్య ఆర్టీసీ బస్సులతోపాటు వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. మరో రెండు రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉండటంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. వరదలు, వర్షాలపై తాడేపల్లి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథార్టీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్షించారు. సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలని సీఎం ఆదేశించారు. అనంతరం కనకదుర్గ వారధి నుంచి కృష్ణానదీ తీరాన్ని చంద్రబాబు పరిశీలించారు. అక్కడి నుంచి బుడమేరు ముంపు ప్రాంతాలకు చంద్రబాబు వెళ్లారు. తిరిగి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సీఎం చేరుకుని ముంపు ప్రాంతాలపై సమీక్షించారు. విజయవాడ మొగల్రాజపురంలో కొండచరియలు విరిగి చనిపోయిన మృతుల కుటుంబాలను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నేతృత్వంలో పార్టీ బృందం పరామర్శించింది.

సురక్షిత ప్రాంతాలకు ఏలూరుజిల్లా లోతట్టు ప్రజలు

ఏలూరుజిల్లాలో వర్షం పడుతోంది. తమ్మిలేరు, ఎర్రకాలువ, పోలవరం ప్రాజెక్టులకు వరద ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. తమ్మిలేరు జలాశయం గేట్లు పూర్తిగా తెరచుకుపోవడంతో క్రేన్ల సహాయంతోవాటిని తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏలూరుజిల్లా నూజివీడు మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని అధికారులు తెలిపారు. 200 మందిని నూజివీడులో జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటుచేసి, భోజన, వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. భద్రాచలం వద్ద గోదావరి వరద నీటి మట్టం, నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరు నీటి మట్టం పెరుగుతున్న దృష్ట్యా ఆయా తీర ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం చేశారు. గుంటూరుజిల్లాలోని వివిధ ప్రాంతాలు నీట మునిగాయి. గుంటూరు ఆర్టీసీ బస్‌స్టేషన్‌లోకి నీరు రావడంతో మూసివేశారు.

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని గ్రంథాలయంలోకి నీరు ప్రవేశించింది. పల్నాడుజిల్లాలోని అమరావతి మండలంలో మూడు లంక గ్రామాలలో చిక్కుకున్న 36 మందిని, 1150 జీవాలను జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు చొరవతో ధరణి కోట గ్రామంలోని సురక్షిత(బోర్డు సెంటర్) ప్రాంతానికి సంబంధిత రెవెన్యూ సిబ్బంది తరలించారు. పల్నాడుజిల్లా యడ్లపాడు మండలం కొండవీడు ఘాట్ వద్ద కొండ చరియలు విరిగి పడిపోయాయి.

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలోని పొల్లూరు జలపాతం, సొకిలేరు వ్యూ పాయింట్, పుష్పబ్రిడ్జి స్పాట్‌లను మూసివేశారు. నంద్యాలజిల్లాలో భారీగా పంటకు నష్టం వాటిల్లింది. దీంతోరైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాల ప్రభావంతో ఆత్మకూరు-దోర్నాల, దోర్నాల-శ్రీశైలం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

ప్రకాశం బ్యారేజీకి 10 లక్షల క్యూసెక్కులు

శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టుల గేట్లన్నీ ఎత్తి కృష్ణానదిలోకి నీటి విడుదల



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారీగా వస్తున్న వరద నీటితో జలాశయాల నిర్వహణ పరిస్థితి ప్రమాదకరంగా మారింది. వరుస వారీగా గేట్లను ఎత్తివేస్తున్నారు. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో జలాశయాలు నిండిపోతున్నాయి. జలవనరులశాఖ ఆదివారం ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేసింది. ఎగువ నుంచి ప్రకాశంబ్యారేజీకి రికార్డుస్థాయిలో 9.40 లక్షల క్యూసెక్కుల నీటిని మొత్తం 70 గేట్లను ఎత్తి సముద్రంలోకి విడుదల చేశారు. కాగా, ఎగువ నుంచి వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో అది 10 లక్షలకు చేరే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో బ్యారేజీ వైపు వాహనాల రాకపోకలను నిషేధించారు. 2009 అక్టోబర్ 5న రికార్డుస్థాయిలో వచ్చిన 11,10,404 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేగా, దశాబ్దాన్నర తర్వాత అంతటిస్థాయిలో వరద బ్యారేజీకి చేరుకుంటోంది. జలాశయాల నిల్వ సామార్థ్యానికి దగ్గరగా వరద ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో తుంగభద్ర డ్యామ్‌లోని 11వ గేటు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రాష్ట్ర పరిధిలో ఉన్న జలాశయాల పరిస్థితి, వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. వరుస వారీగా జలాశయాలు నిండటం, వాటి గేట్లను ఎత్తి దిగువకు వదలడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ నిండుకుండలా మారాయి. గంట గంటకూ జలాశయాల వరద నీరు ఉధృతి పెరుగుతోంది. కాలువలు, వాగులు పొంగిపోయాయి. అటు గోదావరి నది ప్రవహిస్తోంది. ప్రకాశం బ్యారేజీ దగ్గర శనివారం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయగా, వరద ఉధృతి మరింతగా పెరగడంతో తాజాగా రెండో ప్రమాద హెచ్చరికను జారీజేశారు. పోలవరం దగ్గర వరద నీరు చేరింది. జలాశయాల దగ్గర ప్రమాద హెచ్చరికలు జారీజేస్తున్నారు. కృష్ణానది ప్రవాహం ఉధృతంగా ఉండడంతో పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.నంద్యాల జిల్లాలోని శ్రీశైలం జలాశయానికి భారీగా వరదనీరు కొనసాగుతోంది. మరో వైపు శ్రీశైలం డ్యాం వద్ద ఇన్ ఫ్లో 3,60,030 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 4,86,715 క్యూసెక్కులుగా ఉంది. జలాశయం 8 గేట్లను 8 అడుగుల మేర, రెండు గేట్లను 10అడుగుల మేర ఎత్తి అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885.00 అడుగులలో 215.80 టీఎంసీలకుగానూ, ప్రస్తుతం 884.50 అడుగులలో 212.9198 టీఎంసీలుగా ఉంది. నాగార్జునసాగర్ వద్ద ఇన్ ఫ్లో 4,93,782 ఔట్ ఫ్లో 5,75,903 క్యూసెక్కులు నమోదైంది. ప్రాజెక్టు 26 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టు 23 గేట్లు ఎత్తి అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. పులిచింతల పూర్తి నిల్వ సామర్థ్యం 45.77టీఎంసీలు ఉండగా ప్రస్తుతం ప్రాజెక్టులో 42.16టీఎంసీలకు చేరుకుంది.

కొండచరియ బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. భారీ వర్షాలకు మొగల్రాజపురంలో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని ఆదివారం రామకృష్ణతో పాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, అక్కినేని వనజ, నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు తదితరులు పరిశీలించారు. ప్రమాద సంఘటన గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబాల వద్దకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తరచూ కొండచరియలు విరిగి పడటం వల్ల స్థానికులు ఆందోళన చెందుతున్నారన్నారు. గత 50 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా భారీ వర్షాలు సంభవించాయని తెలిపారు. కొండ ప్రాంతాలలో రిటైనింగ్ వాల్, ఐరన్ మెస్ నిర్మించాలని డిమాండ్ చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ముంపులతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయని చెప్పారు. కాల్వలు, వాగులు పొంగి పొర్లడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టాన్ని తక్షణమే అధికారులు అంచనా వేయాలని కోరారు. వరద బాధితులకు పునరావాసం కల్పించి, ఆహారం అందించాలని కోరారు. బాధితులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా అధికార యంత్రాంగం పని చేయాలన్నారు. ఇళ్లు, సామాగ్రి కోల్పోయిన వారికి తక్షణ సాయం అందించాలని డిమాండ్ చేశారు. తెగిపోయిన వాగులు, కాలువలకు, చెరువులకు ప్రభుత్వం మరమ్మతులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర నాయకులు అప్పురబోతు రాము, స్థానిక పార్టీ నాయకులు కొడాలి ఆనందరావు, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, బి.శాంతమ్మ, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పవర్ లిఫ్టింగ్‌లో భారత్ జయకేతనం

(మొదటిపేజీ తరువాయి)

అమెరికా, 39 పాయింట్లతో ఉక్రెయిన్ రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. జూనియర్ మహిళల ఎక్విప్‌డ్ టీం ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఒక బంగారు పతకం, ఒక రజత పతకం సాధించి నాలుగో స్థానంలో నిలిచింది.

ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి పాల్గొన్న ధోనె మురళీకృష్ణ, షేక్ సాధియా అల్మాస్ బంగారు పతకాలను, సయ్యద్ ఖాజావలి కాంస్య పతకాన్ని సాధించిన సంగతి తెలిసిందే. కాగా పురుషుల టీం ఛాంపియన్‌షిప్ భారత్ కైవసం చేసుకోవడం చరిత్రలో ఇదే తొలిసారి అని పవర్‌లిఫ్టింగ్ ఇండియా అధ్యక్షుడు సతీశ్ కుమార్, సెక్రటరీ జనరల్ పీజే జోసెఫ్ తెలిపారు.

మోదీ ...ఆ హక్కు నీకెక్కడిది

(మొదటిపేజీ తరువాయి)



వ్యతిరేక బిల్లులను ఆమోదించుకున్నదని విమర్శించారు. ఈ కార్మిక వ్యతిరేక చట్టాలను దేశ వ్యాపితంగా అన్ని కార్మిక సంఘాలు నిరంతరం వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సంఘటిత ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని పిలుపు నిచ్చారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత 29 కార్మిక చట్టాలను కొనసాగించాలని ఏఐటీయూసి డిమాండ్ చేస్తోందన్నారు. దీనిపై కేంద్ర కార్మిక సంఘాలు అన్నీ సెప్టెంబర్ 23న బ్లాక్ డే పాటించాలని నిర్ణయించాయని, దీనికి ఎస్‌కేఎం కూడా మద్దతు ఇచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. కనీస వేతన చట్టానికి 2019 ఆగస్టులో నోటిఫికేషన్ జారీ చేసిందని, దాదాపు అయిదేళ్లు కావస్తున్నా ఇంకా ఇది అమలు కాకపోవడం సిగ్గుచేటన్నారు. కనీస వేతన చట్టం అమలు కోసం నవంబర్ 26న దేశ వ్యాప్తంగా భారీ నిరసన ప్రదర్శనలు చేపడుతున్నామని తెలిపారు. వీటిపై జాతీయ కౌన్సిల్‌లో తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు. రాబోయే కాలంలో ప్రభుత్వ విధానాలపై మరింత అప్రమత్తంగా ఉండాలని, ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని అమర్‌జిత్ కౌర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు, విశాఖ స్టీల్ ప్లాంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఆదినారాయణ, ఏఐటీయూసి జాతీయ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు వేదికపై ఆశీనులయారు. ప్రజానాట్యమండలి కళాకారులు అభ్యుదయ గేయాలు అలపించారు. తిరుపూర్‌లో జరిగిన ఏఐటీయూసి జాతీయ కౌన్సిల్ సమావేశాల అనంతరం ఇప్పటి వరకూ యూనియన్ కార్మిక హక్కుల రక్షణ కోసం, వారి సంక్షేమం కోసం, ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చేపట్టిన ఆందోళన కార్యక్రమాలపై ప్రధాన కార్యదర్శి అమరజిత్ కౌర్ నివేదిక సమర్పించగా, దానిపై సాయంత్రం సెషన్‌లో సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు.

జానపద కళలు కాపాడుకుందాం

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర జనరల్ మేనేజరు హరినాథరెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: 'అన్ని కళలకు జానపద కళలు మూలం. అలాంటి కళలను కాపాడుకోవాలి. జానపద కళలను భావితరాలకు అందించాలి. జానపద కళలు అంతరించే పోయేవేళ ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి ప్రజా చైతన్య జానపద కళా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయం. ఈ ఉత్సవాలు కళాకారుల్లో కొత్త ఊపిరి పోస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ పేరొందిన కళాకారుడు. ఆయన చొరవ తీసుకుని ఏపీలో కళాకారులను ఆదుకోవాలి' అని విశాలాంధ్ర జనరల్ మేనేజరు పి.హరినాథరెడ్డి కోరారు. శ్రీకాళహస్తి పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్వర్యంలో తిరుపతి జిల్లాస్థాయి ప్రజా చైతన్య జానపద కళా ఉత్సవాలు నిర్వహించారు. హరినాథరెడ్డి మాట్లాడుతూ జానపద కళలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జానపద కళలకు సంబంధించి తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

గతంలో ప్రసార మాధ్యమాలు ఉండేవి కాదని, అయినా జానపద కళలకు ఎంతో ఆదరణ ఉండేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వీధి నాటకాలు, జక్కీక, కోలాటాలు, పండరి భజన ఎంతో ప్రాచుర్యం పొందాయన్నారు. భారతం, రామాయణం, భాగవతం వంటివి జానపద కళల ద్వారానే కళాకారులు ప్రజలకు తెలియచేసే వారన్నారు. సినిమాల రాకతో జానపద కళలకు ఆదరణ తగ్గిపోయిందని హరినాథరెడ్డి అభిప్రాయపడ్డారు. డీజే కారణంగా సంప్రదాయ కళలు దెబ్బతింటున్నాయన్నారు. నిన్న మొన్నటి వరకు చర్మ వాయిద్యమైన డప్పు ఎంతో ప్రాచుర్యం పొందిందన్నారు. ప్రజలకు ఏ సమాచారం తెలియ చేయాలన్నా... జానపద గీతాలు ఆలపించాలన్నా డప్పు తప్పనిసరి అన్నారు. నేడు డీజేల కారణంగా డప్పు కనుమరుగు అయిందని హరినాథరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందినా...గ్రామీణ కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో జానపద కళలు కీలక పాత్ర పోషించాయని హరినాథరెడ్డి గుర్తు చేశారు. జానపద కళల అభివృద్ధికి ప్రభుత్వం సహకరిం చాలని ఆయన కోరారు. కళలను ప్రోత్సహించడానికి ప్రత్యేక ఆడిటోరియాలు నిర్మించాలన్నారు.

సినీ దర్శకులు భీమాస్ అశోక్ మాట్లాడుతూ ప్రజా నాట్యమండలి నిర్వహిస్తున్న ప్రజా చైతన్య జానపద కళా ఉత్సవాలు చూస్తుంటే తన బాల్యం గుర్తుకు వస్తోందన్నారు. ఆధునిక సమాజంలో గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలు మరచిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉత్సవాల్లో కళాకారులు అద్భుత ప్రదర్శన చేశారని అశోక్ కొనియాడారు. కళల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని అశోక్ హామీ ఇచ్చారు. మరో సినీ దర్శకులు సోమసుందరం మాట్లాడుతూ తాను ఇప్పటి వరకు నాలుగు సినిమాలకు దర్శకత్వం వహించానని, భవిష్యత్తులో ప్రతిభ ఉన్న కళాకారులను మరింత ప్రోత్సహిస్తానని హామీ ఇచ్చారు. కాగా ప్రజా చైతన్య జానపద కళా ఉత్సవాల్లో బైల నాటకం, వీధి నాటకం, బ్యాండ్ సెట్, సన్నాయి, డప్పు, కోలాటం, డీజేతో పాటు వివిధ కళారూపాలు ప్రదర్శించారు. ఈ కళారూపాలు ఆహుతులను ఎంతో అలరించాయి. అంతకుముందు వందలాది కళాకారులు తమ వాయిద్యాలతో శ్రీకాళహస్తి పట్టణంలోని అంబేద్కర్ కూడలి నుంచి అంబేద్కర్ భవన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన శ్రీకాళహస్తి వాసులను ఎంతో ఆకట్టుకుంది. అంబేద్కర్ భవన్ వద్ద కళాకారులు తమ జానపద కళలు ప్రదర్శించారు. ఉత్సవాలకు తిరుపతి జిల్లా నలుమూలల నుంచి కళాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సినీ నటుడు కృష్ణ చైతన్య, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి కాలయ్య, అధ్యక్షులు నాగభూషణం, నాయకులు బలరాం, ముకుంద, కత్తి రవి, జనమాల గురవయ్య, గోపి, మించల శివకుమార్, శ్రీనివాసులు, గురవయ్య, ముని చందు, మంజుల, నాగభూషణమ్మ, చారులత, రత్నమ్మ, భజన గురువులు, కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీశైలానికి భారీ వరద

దోర్నాల నుంచి శ్రీశైలంకు రాకపోకలు నిలిపివేత

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో డ్యామ్ 10 గేట్ల ద్వారా నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. అధికారులు 10 గేట్లలో 8 గేట్ల ఎత్తును 18 అడుగులకు పెంచి, 2 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 4,04,036 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదనంగా రెండు విద్యుత్ కేంద్రాల ద్వారా 68,354 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. జూరాల, సుంకేసుల నుంచి 3,56,472 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలానికి చేరింది. జలాశయం నీటిమట్టం 884.50 అడుగులు కాగా, నిల్వ సామర్థ్యం 212.9198 టీఎంసీలుగా నమోదయింది. భారీ వర్షాల కారణంగా నల్లమల అటవీ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని భావించిన అధికారులు దోర్నాల-శ్రీశైలం, దోర్నాల-ఆత్మకూరు మధ్యలో రాకపోకలు నిలిపివేశారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు శ్రీశైలంలోని కొత్తపేట తదితర ప్రాంతాల్లో కొండపై నుంచి భారీగా నీరు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆత్మకూరు నుంచి అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఉమ్మడి జిల్లాలో చాలాచోట్ల రోడ్డుకు అడ్డంగా వరద నీరు ప్రవహిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

దెబ్బతిన్న పంటకు నష్టపరిహారం

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారీవర్షాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 14 జిల్లాల్లో లక్ష హెక్టార్ల పైగా వరి పంట దెబ్బతిందని, మరో 10 వేల హెక్టార్లలో ఉద్యానపంటలు ధ్వంసమయ్యాయని, ఆయా శాఖల సిబ్బంది రంగంలోకి దిగి... నష్ట నివారణ చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల వల్ల మృతి చెందిన 9 కుటుంబాలకు రూ.10 లక్షల వంతున పరిహారం ప్రకటించాలని, భారీ వర్షాలకు అతలాకుతలమవుతున్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి... ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం అప్రమత్తమై భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలన్నారు. అనేక ప్రాంతాల్లో కాల్వలకు, చెరువులకు, వాగులకు గండ్లు పడి పంటలు నీటి మునిగాయని, భూములు కోతకు గురయ్యాయని వివరించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి వద్ద బుడమేరుకు గండిపడి పంట పొలాలు దెబ్బతిన్నాయని, పాముల కాలువ అంబాపురం వద్ద మరో గండిపడి సుమారు 10 గ్రామాలకు చెందిన వరి పంట నీట మునిగిందని పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలానికి చెందిన నున్న, కుందావారి కండ్రిగ చెరువులు తెగిపోయాయని, బుడమేరు ఆక్రమణకు గురికావడమే ఇందుకు కారణమని ఆరోపించారు. ఆక్రమణలు తొలగించడంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. కృష్ణానదిపై వరద ఉధృతి అధికం కావడంతో ప్రకాశం బ్యారేజ్ వద్ద ప్రమాద హెచ్చరిక జారీజేశారని, సుమారు 7,69,433 క్యూసెక్కుల నీటిని అధికారులు సముద్రంలోకి వదిలేస్తున్నారని తెలిపారు. పల్లపు ప్రాంత ప్రజలను అప్రమత్తంచేసి... ప్రాణ, ఆస్తి నష్టం లేకుండాప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల వల్ల వ్యాధులు పెరగకుండా అప్రమత్తం చేయాలని సూచించారు. ఉద్యాన, రెవెన్యూ శాఖాధికారులు, సిబ్బంది పంట నష్టాలను పూర్తిస్థాయిలో అంచనా వేసి రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ

గుడ్లవల్లేరు ఘటనపై కేవీవీ ప్రసాద్ డిమాండ్

విశాలాంధ్ర-గుడివాడ: కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల అమ్మాయిల హాస్టల్‌లో రహస్య కెమెరాల వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలని, మూసివేసిన కళాశాలను తక్షణమే తెరిపించాలని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే విద్యార్థుల తరపున తమ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్ హెచ్చరించారు. స్థానిక ఏలూరురోడ్డులోని సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి టి.తాతయ్యతో కలిసి కేవీవీ ప్రసాద్ ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొన్ని రోజులుగా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే ఆందోళన కలుగుతోందని కేవీవీ ప్రసాద్ అన్నారు. తమ మాన ప్రాణాల రక్షణ కోసం విద్యార్థినులు చేస్తున్న పోరాటం గొప్పదన్నారు. విద్యార్థినుల మరుగుదొడ్లలో రహస్య కెమెరాలు పెట్టి చిత్రీరికరించడం ఘోర తప్పిందమన్నారు. విద్యార్థినుల పోరాటానికి మద్దతు తెలపడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. చదువు కోసం కాలేజీకి వెళ్లిన పిల్లల జీవితాలతో చెలగాటమాడటంపై తల్లిదండ్రులు మానసిక వేదనకు గురవుతున్నారని చెప్పారు. ఈ వీడియోలు బయటికి వస్తే ఆడపిల్లల పరిస్థితి ఏమిటని కేవీవీ ప్రసాద్ ప్రశ్నించారు. కళాశాల యాజమాన్యం సొంతగా బస్సులు పెట్టి రైల్వేస్టేషన్లు, బస్‌స్టాండులకు విద్యార్థులను బలవంతంగా తరలించడం అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. అమ్మాయిల పోరాటానికి మద్దతుగా వచ్చిన ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎం.సాయికుమార్, సాధిక్‌ను అక్రమంగా అరెస్టు చేసి...గుడివాడకు తరలించవలసిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో పోలీసులు, యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయని చెప్పారు. రహస్య కెమెరాల గురించి ఆధారాలుంటే చూపండని బాధిత విద్యార్థినులను అడగటం ఏమిటని నిలదీశారు. ఈ మొత్తం వ్యవహారం నిగ్గు తేల్చడానికి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. పోలీసుల బెదిరింపు ధోరణి విడనాడాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ గుడివాడ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాశ్‌బాబు, సహాయ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్, జిల్లా కన్వీనర్ సాధిక్, డి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రహస్య కెమెరాలు బ్లూ మీడియా సృష్టి

గుడ్లవల్లేరు ఘటనపై మంత్రి లోకేశ్

విశాలాంధ్ర-మంగళగిరి: గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల బాత్రూమ్‌లో రహస్య కెమెరాలు బ్లూ మీడియా సృష్టి మాత్రమేనని, అక్కడ కెమెరాలు ఉన్నట్లు ఎటువంటి ఆధారాలు లభించలేదని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. మంగళగిరి నియోజక వర్గంలో ముంపు ప్రాంతాలను పరిశీలించిన అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో లోకేశ్ విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నేతల సినీనటి వేధింపుల కేసు, మద్యం కుంభకోణం, భూ అక్రమాలు బయటపడతుండటంతో...వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే రహస్య కెమెరాల నాటకానికి తెరలేపారని ధ్వజమెత్తారు. విద్యాశాఖ మంత్రిగా విద్యార్థులంతా తన బిడ్డల్లాంటి వారని, వారిని కాపాడుకునే బాధ్యత తనదేనన్నారు. గుడ్లవల్లేరులో నలుగురు విద్యార్థుల మధ్య జరిగిన వ్యక్తిగత వివాదం ఈ గొడవకు కారణమైందని, సంబంధిత విద్యార్థిని డీటెయిన్ చేసి ఇప్పటికే అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఆహారం కలుషితమైందని తెలిసిన వెంటనే డైరెక్టర్‌ను విధుల నుంచి తొలగించామని, ముగ్గురు ఉన్నతాధికారులతో పర్యవేక్షక కమిటీని నియమించామని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి మాదిరిగా తాను తల్లీ, చెల్లిని రోడ్లపైకి గెంటేసే రకం కాదన్నారు. నాడు-నేడు పేరుతో జగన్ ప్రభుత్వం వేలకోట్లు ఖర్చు చేసినట్లు తప్పుడు లెక్కలు చెబుతోందని, అదే నిజమైతే రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో గత ఐదేళ్లలో 10 లక్షల మంది విద్యార్థులు ఎందుకు తగ్గారని నిలదీశారు. డిజిటల్ క్లాస్ రూమ్‌లు జగన్ కొత్తగా కనిపెట్టలేదని, అవి అంతకుముందే ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా రంగులు వేసి వందల కోట్లు దిగమింగారని దుయ్యబట్టారు. విద్యార్థులకు సరఫరా చేసే గుడ్లు, చిక్కీలు, ఆయాల జీతాలు కూడా బకాయి పెట్టి వెళ్లారని, వాటన్నింటినీ ఒక్కొక్కటిగా తాము విడుదల చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తామని మంత్రి లోకేశ్ స్పష్టంచేశారు.

ముంపు బారిన 294 గ్రామాలు

బాధితులకు పునరావాస కేంద్రాల ఏర్పాటు

హోం మంత్రి అనిత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ముంపు బారిన పడిన 294 గ్రామలకు చెందిన 13,227 మందిని పునరావాస కేంద్రాలకు తరలించామని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలోని స్టేట్ ఎమర్జన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి ఆదివారం ప్రస్తుత వరద పరిస్థితులను ఆమె సమీక్షించారు. మంత్రి అనిత మాట్లాడుతూ ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అధిక వర్షాల కారణంగా ఇంత వరకు 100 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 13,227 మందిని తరలించామని, ఆయా ప్రాంతాల్లో 61 మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశామని వివరించారు. ప్రస్తుత సమాచారం మేరకు భారీ వర్షాల కారణంగా 9 మంది మరణించారన్నారు. పోలీస్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బెటాలియన్ల బృందాలు ముంపు ప్రాంతాల్లోని 600 మందిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించామని తెలిపారు. 9 ఎస్డీఆర్ఎఫ్, 8 ఎన్డీఆర్ఎఫ్ మొత్తం 17 బృందాలు 7 జిల్లాల్లోని 22 ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాయని వివరించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులనైన ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని దీనికి అవసరమైన 05 బోట్లు , 01 హెలికాప్టర్ సిద్ధంగా ఉంచామన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో అధిక వర్షాల కారణంగా ఏర్పడిన పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ మంత్రులు అధికారుల సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని నిర్దేశించారన్నారు. వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత పంటనష్టంపై ఎన్యూమరేషన్ చేపడతామని ఇప్పటి వరకు అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం 14 జిల్లాల్లోని 62,644 హెక్టార్లలో వరిపంట నీట మునిగిందని, 7218 హెక్టార్లలో ఉద్యాన వన పంటలు నీట మునిగాయని చెప్పారు. రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య, విద్యుత్ మొదలగు ప్రభుత్వ శాఖలన్ని సమన్వయంతో పనిచేసి యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకోవడం వలన ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగారన్నారు. అన్ని జిల్లాల్లోను కమాండ్ కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ సహాయక చర్యలను చేపడుతున్నామన్నారు. అనేక ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లి ప్రవహిస్తున్నందున ప్రజలు వాటిని దాటే విషయంలో ప్రభుత్వ హెచ్చరికలు పాటించాలని, ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి కోరారు. ఈ సమీక్షలో సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ జి.జయలక్ష్మి, కమిషనర్ శ్రీకేశ్ బాలజీ, విపత్తుల సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల వైఫల్యం

గుడ్లవల్లేరు ఘటనపై ఏపీ పేరెంట్స్ అసోసియేషన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో చోటుచేసుకున్న దారుణ సంఘటన సభ్యసమాజం తలదించుకునేలా ఉందని, సంఘటన జరిగి మూడు రోజులవుతున్నప్పటికీ వాస్తవాలు వెలికితీయడంలో పోలీసులు విఫలమయ్యారని ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. బాలికల బాత్రూంలో రహస్య కెమెరాల ఏర్పాటు నేరపూరిత ఆలోచనలు గల వారు మాత్రమే చేస్తారని ఈశ్వరయ్య పేర్కొన్నారు. కళాశాలలో చదువుతున్న సహ విద్యార్థిని సహాయంతో బాలికల వీడియోలు చిత్రీకరించి... ఆ వీడియోలు అమ్ముకోవడానికి ప్రయత్నించడం అత్యంత దుర్మార్గమని తెలిపారు. తమకు న్యాయం చేయాలని బాధితులు కాలేజీ ఎదుట ఆందోళనకు దిగితే... బాధితులకు రక్షణగా ఉండాల్సిన పోలీసులు...మీ దగ్గర ఆధారాలున్నాయా? వీడియోలు ఉన్నాయా? చూపించాలంటూ విద్యార్థినులను భయభ్రాంతులకు గురి చేయడాన్ని తప్పుపట్టారు. కనీస దర్యాప్తు కూడా చేయకుండా జిల్లా ఎస్పీ వీడియోలేమీ లేవని ఎలా చెబుతారని ప్రశ్నించారు. ఈ వ్యవహారం రాజకీయ రంగు పులుము కుందనీ, ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ వాస్తవాలను మరుగునపరుస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై నిజానిర్ధారణ కమిటీ ఏర్పాటు చేస్తేనే దోషులు ఎవరో తేలుతుందన్నారు. ఈ సమస్యకు రాజకీయ రంగు పులిమి అసలు విషయాన్ని పక్కదారి పట్టించవద్దని విద్యార్థుల తల్లిదండ్రుల పక్షాన ఈశ్వరయ్య కోరారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి నిష్పక్షపాత విచారణ జరిపి...బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే విద్యార్థి సంఘాలపైన, జర్నలిస్టులపైన గూండాలతో దాడులు చేయిస్తుంటే...పోలీసులు వారికి మద్దతుగా నిలవడం సిగ్గుచేటన్నారు. యాజమాన్య కొమ్ములు విరిచి విద్యార్థులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

రైతులకు భరోసా అవసరం: బుడితి రాజశేఖర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జిల్లా పాలనా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ రైతులకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సంబంధిత శాఖ అధికారులను వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి బుడితి రాజశేఖర్ ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల వ్యవసాయ అధికారులు, అనుబంధ శాఖాధిపతులతో ఆదివారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాన్ తీరందాటి వర్షాలు తగ్గుముఖం పట్టినందున పంటలు కాపాడేలా అధికార యంత్రాంగం రైతులకు భరోసా కల్పించాలని స్పష్టంచేశారు. ఉత్తర కోస్తా, రాయలసీమ జిల్లాల అధికారులు మాట్లాడుతూ ఈ ప్రాంత పంటలకు వర్షం మేలు చేసేలా ఉందని వివరించారు. బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ కృష్ణానది పరివాహక జిల్లాలు ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడులో పంటలు ముంపునకు గురయ్యాయని, క్షేత్రస్థాయిలో పర్యటించి... ముంపు బారిన పడిన పొలాలను, డ్రెయిన్ల నుంచి నీరు బయటకు పోని ప్రాంతాలను గుర్తించాలని, జిల్లా యంత్రాంగంతోపాటు నీటిపారుదల అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ పంట పొలాల నుంచి నీరు బయటికి వెళ్లడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ నుంచి దిగువకు పారుతున్న వర్షపు నీటి మూలంగా ఎన్టీఆర్ జిల్లాలోని మున్నేరు, కట్టలేరు, బుడమేరులో ఉధృతమయ్యాయని, పంట పొలాలు ముంపునకు గురయ్యాయని చెప్పారు. వ్యవసాయశాఖ సంచాలకులు ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై అత్యాచారయత్నం

కామాంధుడికి దేహశుద్ధి

విశాలాంధ్ర-అవుకు: నంద్యాల జిల్లా అవుకు మండలం కాశీపురం గ్రామానికి చెందిన విద్యార్థినిపై అదే గ్రామానికి చెందిన మోపూరి ప్రభుదాసు అనే వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. విద్యార్థిని తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లగా ఆదివారం కావడంతో ఆ బాలిక ఒంటరిగా ఇంట్లో ఉంది. ఇదే అదునుగా భావించిన మోపూరి ప్రభుదాసు అత్యాచారయత్నానికి పాల్పడటంతో విద్యార్థిని కేకలు వేయగా... అప్పుడే వచ్చిన ఆమె ఇరుగుపొరుగు సహాయంతో కామాంధుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఎస్సై రాజారెడ్డి తెలిపిన వివరాల మేరకు విద్యార్థిని కోయిలకుంట్లలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. ప్రతిరోజు విద్యార్థిని కాశీపురం గ్రామం నుండి పాఠశాలకు చెందిన వ్యాన్‌లో వెళుతుంది. పాఠశాల వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న మోపూరి ప్రభుదాసు కన్ను ఆ బాలికపై పడింది. ప్రభుదాసు ప్రవర్తన సరిగా లేకపోవడంతో పాఠశాల యాజమాన్యం మూడు రోజుల క్రితం విధుల నుంచి తొలగించింది. ఆదివారం సెలవు కావడంతో విద్యార్థిని ఇంటి వద్ద ఒంటరిగా ఉండగా గమనించిన దస్సయ్య ఇంటిలోకి చొరబడి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. విద్యార్థిని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్‌కు డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీ నగర్): ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పాత పెన్షన్ అమలు చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో విశ్రాంత సీపీఎస్ ఉద్యోగుల అధ్వర్యంలో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సూర్యనారాయణ మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులు చేసిన ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు రాష్ట్ర చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించినదిగా నిలిచిపోతుందన్నారు. ఇక్కడ చేసిన ఉద్యమాలు దేశంలో అనేక రాష్ట్రాలలో పాత పెన్షన్ పునరుద్ధరణకు పునాదులు వేశాయని, మన రాష్ట్రంలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. ఈ పరిస్థితి పోయి అందరూ ప్రతి ఒక్కరూ పాత పెన్షన్ తీసుకునే విధంగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఏపీ సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బాజి పఠాన్ మాట్లాడుతు వృద్ధాప్యంలో ఆసరాగా ఉండాల్సిన పెన్షన్‌ను తీసివేయడం దారుణం అన్నారు. ఈ పెన్షన్ మాకు వద్దు పాత పెన్షన్ ఇవ్వాలని మొరపెట్టుకుంటుంటే, దీనినే మెరుగుపరిచి అందిస్తామని మభ్యపెట్టడం ఉద్యోగులకు వెన్నుపోటే అవుతుందని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికల ముందు సీపీఎస్ స్థానంలో పాత పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. కాలయాపన చేయకుండా ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో, దేశంలో పాత పెన్షన్‌కు ప్రత్యామ్నాయం పాత పెన్షన్ మాత్రమేనని స్పష్టం చేశారు. మరో ప్రత్యామ్నాయంగా ప్రభుత్వాలు ఎన్ని పథకాలు తెచ్చినా ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేయరని, పైపెచ్చు తమ వ్యతిరేకతను ఎదుర్కొవలసి వస్తుందని తెలిపారు. సీపీఎస్ పథకంలో ఉండి పదవీ విరమణ పొందిన ఉద్యోగి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తాను పదవీ విరమణ పొందిన తర్వాత రూ.2,500 పెన్షన్ వస్తుందని, దీనితో ఎలా బతకాలో పాలకులు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు, చీర్ల కిరణ్, వెంకట జనార్దన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఎస్.శాంతి, హుస్సేన్, జి.రాజు, వి.కృష్ణమోహన్, ఏ.జె.వి.యన్.రావు, రిటైర్డ్ ఉద్యోగి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగి ముగ్గురు విద్యార్థుల మృతి

విశాలాంధ్ర-పెద్దారవీడు: ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం కొత్తపల్లి గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పంట పొలం కోసం ఏర్పాటు చేసుకున్న నీటి కుంటలో దిగిన ముగ్గురు విద్యార్థులు ఊపిరాడక మృతి చెందారు. ఈ దుర్ఘటన ఆదివారం మధ్యాహ్నం సంభవించింది. వివరాల్లోకి వెళితే రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వాన ఆదివారం మధ్యాహ్నం కొంచెం తెరపించడంతో కొందరు విద్యార్థులు ఆటలాడుకుంటూ గ్రామ సమీపంలోని నీటి కుంట వద్దకు వెళ్లారు. ఈ ఘటనలో మృతి చెందిన కొత్తపల్లి శివ(11) మార్కాపురంలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థలో 6వ తరగతి చదువుతున్నాడు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ఆరవీటి ఏడుకొండలు (9), కొత్తపల్లి మను(9) మృతి చెందారు. ఓ విద్యార్థి కాలుజారి నీట మునగడంతో... ఆ విద్యార్థిని రక్షించడానికి మిగతా విద్యార్థులు ప్రయత్నించారు. చివరికి నీటి కుంటలో పడి మృతి చెందారు. మిగిలిన విద్యార్థులు ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలిపారు. వారు వచ్చి బయటకు తీయగా అప్పటికే విద్యార్థులు మృతిచెందారు. విద్యార్థుల మృతదేహాలను గ్రామంలోకి తీసుకురాగా హాహాకారాలు మిన్నంటాయి.

ప్రగతిశీల కవి సన్నిధానం

సాహితి

గాడేపల్లి దివాకర్‌దత్, 9963245144

సాహిత్యవేత్త సన్నిధానం నరసింహశర్మ పేరు వినగానే సహృదయులకు గోదావరి, రాజమహేంద్రవరం, గౌతమీ గ్రంథాలయం చప్పున గుర్తుకు వస్తాయి. మేధావులను, ప్రముఖ సాహితీవేత్తలను నడిచే విజ్ఞాన సర్వస్వం, నడిచే గ్రంథాలయం అనటం మనం వింటూనే ఉంటాము. నాలుగున్నర దశాబ్దాల పాటు గౌతమీ గ్రంథాలయంతో పాటు ఎదిగిన సన్నిధానం నరసింహశర్మను మాట్లాడే గౌతమీ గ్రంథాలయంగా సంభావిస్తుంటాను.

సన్నిధానం నరసింహశర్మ వయసు పదకొండేండ్లే (అసలువయసు చెప్ప కూడదు). ఆయనలో పదకొండు సంవత్సరాల బాలుడిలోఉండే జిజ్ఞాస ఎప్పుడూ కనిపిస్తూనే ఉంటుంది. ఎంత నేర్చుకున్నా ఇంకా నేర్చుకోవాలన్న తపన అతన్ని వెన్నాడుతూనే ఉంటుంది. నిరంతరం జ్ఞానార్జనతో పునీతుడవు తున్నారు నరసింహశర్మ. ఓ మహాకవి 'నా ఉచ్ఛ్వాసంకవనం నా నిశ్వాసం గానం' అన్నాడు. సన్నిధానం ఉచ్ఛ్వాసం, నిశ్వాసంకూడా సాహిత్యమే. కాక పోతే వివిధ శాస్త్రసంబంధ జ్ఞాన సముపార్జనమే. పట్టుమని 5నిముషాల సేపు ఆయన సాహిత్యేతర విషయాలు, కుటుంబ విషయాలు మాట్లాడటం నేనెరగను.

ఓసారి గౌతమీ గ్రంథాలయంలో విమానం అట్టబొమ్మగా ఉన్న భరద్వాజ వైమానిక శాస్త్ర గ్రంథంతో (ఆంగ్ల వ్యాఖ్య ఉన్న సంస్కృత గ్రంథం) ప్రత్యక్ష మయ్యాడు. నిరంతర జ్ఞానాన్వేషియైన సన్నిధానం గౌతమీ గ్రంథాలయం చలువపందిరి కింద దాదాపు నాలుగున్నర దశాబ్దాల పాటు ఉద్యోగించటం తెలుగు సాహిత్యం చేసుకున్న అదృష్టం.

సన్నిధానంకు జీవితం వడ్డించిన విస్తరి కాదు. బాల్యంలోనే తండ్రి గతిస్తే కుటుంబబాధ్యతలు నెత్తినపడ్డాయి. తరగతిఫీజులు చెల్లించలేక విద్యకు దూర మయ్యారు. 15 ఏళ్ల వయసులో గౌతమీ గ్రంథాలయంలో పుస్తకాలు సర్దిపెట్టే ఉద్యోగంలోకి (జానపదబ్రహ్మ కీ.శే.నేదునూరి గంగాధరం సిఫార్సుతో) కుదురు కున్నాడు. 1962 ప్రాంతాలలో నెలకు ఇరవైరూపాయలజీతం అతని కిచ్చేవారు.

సన్నిధానం తన రచనలను తాను దాచుకోరు. ఓ నెల క్రితం ఓ టీవీ ఛానల్ వాళ్లు శర్మగారిని ఇంటర్వ్యూ చేస్తున్నప్పుడు అతని గ్రంథాల ఫొటోలు తీసుకుంటామంటే ఇబ్బంది పడ్డారు. మా దగ్గర ఉన్న అతని గ్రంథాల ఫొటోలు తీసి పంపవలసి వచ్చింది. ప్రాణహిత (కవితాసంపుటి), దీధితి (సాహిత్య వ్యాస సంపుటి), బ్రౌను ఉదాహరణ కావ్యం, సన్నిధానంకు రాసిన ఆరుద్ర లేఖలు, చలసాని ప్రసాద్ లేఖలు, ప్రమేయఝరి (పరిశోధన వ్యాస సంపుటి), మధుస్మృతి (ఆంధ్ర పురాణకర్త మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి స్మృతులు), నేదునూరి గంగాధరం మోనోగ్రాఫ్ మొదలైన గ్రంథాలు మాత్రమే ప్రచురణకు నోచుకున్నాయి. దాదాపు 30 పైచిలుకు ప్రచురిత రచనలు ప్రస్తుతం అలభ్యాలు. సన్నిధానం వారిది డిగ్రీలు లేని పాండిత్యం.



కళాశాలల్లో చదువుకోక పోవటం వల్ల ఆయనకు కించిత్తుకూడా లోపం కలుగ లేదు, వీరు నిరంతర గ్రంథాధ్యయనశీలి కావటం వల్ల. మామూలుగా శిష్యులు మా గురువులు ఇంతటివారని చెప్పి మురిసి పోతుంటారు. మా గురువులు మహనీయులు, మహాకవులు అని శర్మగారు కూడా మురిసిపోతారు. కానీ శర్మగారి గురువుగారు మధునాపంతుల వారు, ఆరుద్రగారు మా శిష్యుడు సన్నిధానం అని చెప్పుకొని గర్వపడటం మనకు ఆశ్చర్యం కలిగిస్తుంది.

జానపద బ్రహ్మ నేదునూరి గంగాధరం సన్నిధానంకు తొలి గురువు. నేదునూరి గంగాధరం జానపద గీతాలు వేల సంఖ్యలో సేకరించారు. పల్లెటూళ్లకు పోయి పొలం గట్ల మీద, చెట్లకింద నుంచుని వారి గీతాలను, వారి నోటి నుంచి దొరలివచ్చే సామెతలను సేకరించిన జానపద కవితోద్ధారకుడు నేదునూరి గంగాధరం. వారి కుటీరం సన్నిధానంను ఎప్పుడూ ఆహ్వానిస్తూనే ఉండేది. సెలయేరు, మిన్నేరు, మున్నీరు వంటి సంకలన గ్రంథాలను ప్రచురించి, జానపద సాహిత్యంపైన పుంఖానుపుంఖంగా వ్యాసాలు రచించి జీవితాన్ని పునీతం చేసుకున్నవారు నేదునూరివారు. నేదునూరి గంగాధరం జీవిత చరిత్ర (మోనోగ్రాఫ్) కేంద్ర సాహిత్య అకాడమీ కోసం రచించి గురువు రుణం తీర్చుకున్నారు సన్నిధానం.

నేదునూరి వారే సన్నిధానంకు మహాకవి మధునాపంతుల వారిని పరిచయంచేశారు. ఆనాటి నుంచి మధునాపంతులవారి జీవితం, సాహిత్యంతో సన్నిధానం జీవితం పెనవేసుకుపోయింది. మధునాపంతులవారి ఆంధ్ర పురాణంలోని పద్యాలన్నీ సన్నిధానంకు కంఠోపాఠమే. అందుకే ఆంధ్ర పురాణ ప్రచారకులు అంటూ రాజమహేంద్రవరం సాహితీవేత్తలు ఆయనకు ఓ బిరుదుఇచ్చారు. సన్నిధానం పద్యపఠనంలో హృదయాలను ఆకర్షించే అద్భుత శక్తి ఉంటుంది. పద్యాన్ని రసరమ్యంగా వ్యాఖ్యానించటంలో సన్నిధానంకు సన్నిధానమే సాటి. మధునాపంతుల వారితో ఉన్న తన మధుర స్మృతుల్ని పంచుకుని, ఆంధ్ర పురాణంలోని అవతారిక, చాళుక్య పర్వాలకు సురుచిర వ్యాఖ్యానం సంతరించి గురువు ఆశీస్సులను పుష్కలంగా అందుకున్నారు.

మధునాపంతుల వారు మహాకవి అయితే సన్నిధానం వారి మరో గురువు మల్లంపల్లి శరభయ్య మహాపండితులు. శరభయ్య పాండిత్యంలో విశ్వనాథ అంతటి వారు. సన్నిధానంవారు, వాడ్రేవు చినవీరభద్రుడు వీరి శిష్యులుగా కవితాశిల్ప రహస్యాలు తెలుసుకుని తమ రచనలకు సుగంధాలు అలదుకున్నారు. ఆరుద్ర వీరి బ్రౌను ఉదాహరణ కావ్యం అంకితం పుచ్చుకున్న సందర్భంలో "ఆయన (సన్నిధానం) గురుపరంపరలో మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి, మల్లంపల్లి శరభయ్యశర్మ ప్రథమ ద్వితీయాచార్యులైతే తృతీయాచార్యునిగా వారి సరసన నన్ను నిలబెట్టడానికి సంబరపడుతున్నారు" అని అంటారు. వీరేశలింగం, గురజాడ, గిడుగుల ఆలోచనాధారను తమ గురువు ఆరుద్ర పుణికిపుచ్చు కున్నారని తెగ మురిసిపోతారు సన్నిధానం. ఆరుద్రకి 'బ్రౌను ఉదాహరణ' కావ్యం అంకితమిచ్చి, ఆయన తనకు రాసిన లేఖల్ని ప్రచురించి తెలుగు సాహిత్యానికి మహోపకారం చేశారు సన్నిధానం. సన్నిధానం కవిత్వం విలక్షణంగా ఉంటుంది. 'ప్రాణహిత' సంప్రదాయ వాసనల్ని, ఆధునిక కవితారీతుల్ని మేళవించుకున్న కావ్యం. భూమి భాస్కరుని చుట్టూ ఎన్నిమార్లు తిరిగినా కరకుటెదవాడు సూర్యుడు కరుగలేదని, భాస్కరాలక్ష్యమను బాధతో భూమి నీరుగారిపోయిందని, అందువల్లే భూమిపై మూడువంతుల భాగం నీళ్లు ఉన్నాయని, ఇంకాఇంకా భ్రమిస్తూ ఉంటే ప్రళయం సంభవిస్తుందేమోనని విచిత్రమైన ఊహ చేసి 'ప్రళయం' అనే స్వచ్ఛ కవిత రాశారు. ఈ ప్రళయం కవిత విశ్వకవితావేదిక పైన కవులను ఆకట్టుకున్నదట. గోదావరిని (ప్రాణహితను)

"భుక్తమిది నాకు నాలోని రక్తమిదియె/పానమిది నాకు మాటాడ బ్రాణమిదియె/ ఊరిసిరి నాకు నాలోని ఊపిరిదియె/నాకు సర్వస్వ దాన మీ నదియె చేయు" - అంటూ శ్లాఘిస్తారు. గోదావరి నదిని తలచుకుంటే శర్మ హృదయం పొంగి ప్రవహిస్తుంది.

"అవును నేను రైతు గురించీ రాస్తాను/ఎందుకా? అన్నం తినేవాణ్ణి కనుక"- అనే సన్నిధానం మినీకవిత కొన్ని దశాబ్దాలకు ముందు సాహితీ వేత్తలను, పఠితలను విశేషంగా ఆకర్షించింది.

మధురగాయకులు కీ.శే.ఎస్.పి బాలసుబ్రహ్మణ్యం సన్నిధానం రాసిన ఆరు పాటలను ఆలపించారు. వీరి 'రారాజ హృదయమా! రాణ్మహేంద్ర నగరమా!' పాటను గూడా బాలుగారే పాడారు. ఈయన నాలుగున్నర దశాబ్దాల పాటు లక్ష పైచిలుకు తెలుగుగ్రంథాలతో అనుబంధం పెంచుకున్నారు. గౌతమీ గ్రంథాలయానికి వచ్చే పరిశోధక విద్యార్థులకు వీరు ఓ మంచినీటి చెలమ.

పరిశోధకవిద్యార్థులకు దశ, దిశ నిర్దేశించే మార్గదర్శకులుగా వారి హృదయాల్లో చోటు సంపాదించుకున్న ప్రతిభాశాలి సన్నిధానం. నేడు అపురూపమైన, అలభ్యమైన, తెలుగులో వచ్చిన తొట్టతొలి అచ్చు పుస్తకం 'నూరు జ్ఞానవచనాలు' (ప్రథమ ముద్రణ క్రీ.శ.1746-47) ను విశేషమైన పరిశ్రమ చేసి, కలకత్తా శ్రీరాంపురం లైబ్రరీకి రెండుసార్లు వెళ్లి, శ్రమకు ఓర్చి సేకరించి పునర్ముద్రించటం సన్నిధానం జీవితంలో ఓ అద్భుత ఘట్టం. ఎన్నో పోగొట్టుకుంటున్న తెలుగువాడికి అచ్చయిన తొట్టతొలి పుస్తకాన్ని సంపాదించటం సన్నిధానానికే సాధ్యమైంది. ఈయన బహుముఖ ప్రజ్ఞాశాలి. వక్తగా సభలను ఉర్రూతలూగిస్తారు. వ్యాసకర్తగా దీధితి, ప్రమేయఝరి అనే గ్రంథాలను అందించారు. వీరి సాహిత్యవ్యాసాలలో అడుగడుగునా అభ్యుదయ దృక్పథం గోచరిస్తుంది. ఈయన దిగంబర కవులు నగ్నముని, నిఖిలేశ్వర్‌లతో చేసిన ఇంటర్వ్యూలు 'దిగంబర కవిత్వాన్ని' పునర్మూల్యాంకనం చేసుకోవటానికి తోడ్పడుతుంది. ప్రమేయఝరిలో కృష్ణశాస్త్రిపై వీరు రచించినవ్యాసం అసాధారణం. విస్తృత గ్రంథపఠనం, లోచూపు, పురోగామి దృక్పథం, లోకవృత్త పరిశీలన, అనన్య సాధ్యమైన పరిశోధన, ప్రతిభ వీరి వ్యాసాల్లో అడుగడుగునా మనకు కనబడుతుంది. సంప్రదాయ పండితులు సన్నిధానం గురువులైతే ఆధునికకవులు కీ.శే.కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ, కీ.శే.అద్దేపల్లి రామమోహనరావు, కీ.శే.ఎండ్లూరి సుధాకర్ వంటి కవులు వీరి స్నేహితులు. సతీష్‌చందర్, వాడ్రేవు చినవీరభద్రుడు, కల్లూరి భాస్కరం వంటి వారు వీరికి సుహృన్మిత్రులు. బలమైన సంప్రదాయ పునాదులు ఉన్న సన్నిధానం దార్శనికులుగా ఓ మంచి సమాజాన్ని కలలుగంటూ మనకు రచనల్లో ప్రత్యక్షమవుతారు. అనేక గ్రంథాలయ పురస్కారాలు, సాహిత్య పురస్కారాలు అందుకున్న సన్నిధానం అద్దేపల్లి వారి పురస్కారాన్ని అందుకోబోతున్న సందర్భంగా వారికి అభినందనలు.

(అభ్యుదయ కవి డా॥ అద్దేపల్లి రామమోహనరావు సాహిత్య పురస్కారం-2024 ను సెప్టెంబరు 8 న కాకినాడలో సన్నిధానం నరసింహశర్మ అందుకోబోతున్న సందర్భంగా...)

గ్రంథ సమీక్ష

మాటల మాంత్రికుడు

మందరపు హైమవతి, 9441062732

"మహానుభావా... పండిట్ బిర్జూ..
నా ప్రాణాలిస్తా... నీ కాలికి కట్టుకోవు"

ఈ వాక్యాలు ఏ కవి రాసిన కవితాసంపుటిలోవి అని ఆలోచిస్తున్నారా?.. కానేకావు. ముక్కామల చక్రధర్ రాసిన చక్రవాకం కాలమ్‌లోవి. విశాలాంధ్ర దినపత్రికలో వారం వారం ప్రచురితమవుతూ అశేషాభిమానులను సంపాదించుకున్న కాలమ్ ఇది. ఈ కాలమ్‌లో "నా గురించి రాస్తే బాగుండని"ని ఎంతోమంది కవులు, రచయితలూ కలలు కనే కాలమ్ ఇది. వారానికో కాలమ్ రాయడం రచయితకు కత్తిమీద సాములాంటిది. ఇలా కన్నుమూసి అలా కన్ను తెరచినంతలోనే వారం వచ్చేస్తుంది. కాలమ్ రాయమని గుర్తు చేస్తుంది. సృజనకారులకు ఇదేమీ కష్టంకాదు. ఏ వస్తువునైనా కాలమ్‌గా రాసి పాఠకులకు అందిస్తారు. 84 రాగాలు పలికించిన ఈ చక్రవాకంలో దేనికదే సాటి. సాహిత్య, సామాజిక, రాజకీయ సంఘటనలపై తనదైన శైలితో విశ్లేషిస్తూ వచనమంటే ఇది అని తన ముద్ర అచ్చుగుద్దిన వాక్య విన్యాసమిది.

కవుల గురించి రాసినా, నటులగురించి రాసినా, దర్శకులగురించి రాసినా, కథకులగురించి రాసినా, రైతులధర్నా, "సాహిత్య సత్రాలు, ఆకాశవాణి విజయవాడ కేంద్రం, ఖమ్మం గుమ్మంలో కవిత్వం, వామపక్షాల విజయం, మహిళాబిల్లు"... ఇలా దేని గురించి రాసినా ఆ వస్తువులో పరకాయ ప్రవేశం చేసి రాస్తారు. ఈ పుస్తకంలో మొదటి వ్యాసం "ఆమెలేని లోకం". చక్రధర్ గారు గత సంవత్సరం కన్నుమూసిన తన సహచరి ఈశ్వరి గురించి రాసినది. భార్య పోయిన వెంటనే మరొకరిని పెళ్లి చేసుకొనే కాలంలో ఆమెనే తలుచుకుంటూ, ఆమె తలపుల్లోనే జీవిస్తున్న సహచరుడు రాసిన విషాదగీతమిది. అర్ధాంగికి నివేదించిన ఆత్మగీతమిది.

ఈ పుస్తకాన్ని తన అక్కా, బావలకు అంకితమివ్వడం మానవ సంబంధాలకు అపురూప ప్రాముఖ్యమివ్వడాన్ని తెలియచేస్తుంది.

గద్దర్ మరణించాక రాసిన కాలమ్‌లో "నా బాధంతా గద్దర్‌గురించి కానేకాదు. రాగాన్ని, ప్రాణాల్ని ఆదివాసీల బతుకు పోరాటాలని చెప్పడం ఎలా అని ఏడుస్తున్న ఆ జనం పాట గురించే నా ఆవేదనంతా" అంటారు. సినిమా దర్శకుడు విశ్వనాథ్ దర్శకత్వ ప్రతిభను అక్షరీకరిస్తూ ఆయన సినిమాలను ఎన్నో ఉదహరిస్తారు. "రంగమార్తాండ" సినిమాలో బ్రహ్మానందం నటనా విశ్వరూపం గురించి అద్భుతంగా వర్ణిస్తారు.

"ఊరికే కవిత్వమై'లో అచ్చమైన బి.వి. వి. ప్రసాద్ కవిత్వాన్ని పరిచయం చేస్తూ "లేత అరిటాకు చివర మెరుస్తున్న మంచు బిందువులా ఉంటుంది ప్రసాద్ కవిత్వం. ఎన్ని రాస్తే సీతాకోక ఎగిరిపోయాక ఖాళీలవుతాయి" ఇదే కదా కవిత్వమంటే అని సర్టిఫికెట్ ఇస్తారు. వరవరరావు రాసిన కవిత్వం "వరవరరావు...లైఫ్ ఇన్ పొయెట్రీ" పేరుతో ఇంగ్లీషులో అనువాదమైన సందర్భంలో రాసిన కాలమ్ "ఇక ప్రపంచ ప్రజాకవి వీవీ" జీవితానికీ, కవిత్వానికీ తేడాలేని వీవీ. కవిత్వాన్ని పరిచయం చేస్తూ "వరవరరావు కవిత్వం చదివి కన్నీరు కార్చని వారు ఉండరని నా నమ్మకం" అంటారు. ప్రజల గురించే కవిత్వం రాసిన ప్రజాకవిని ఇప్పుడు ప్రపంచ ప్రజాకవిగా గుర్తించాల్సిందేనని అంటారు చక్రధర్ తన కాలమ్‌లో..

ఇక దిగంబర కవిత్వ సృష్టికర్త, కొయ్యగుర్రం కవి నగ్నముని గారి కవిత్వం గురించి "ఇతడ్ని చదివి జ్వరపడాలి... లేదూ మరణించాలి" అంటారు. అచ్చమైన కవితా ప్రేమికుడైన చక్రధర్ 'కవితో సాయంత్రం'లో హెచ్ఆర్కే "హంస ఎగిరిపోయింది.. కుందుర్తి మిగిలిపోయారు"లో కుందుర్తి గురించి, "నిదురపోని మెలకువ చెప్పిన కవిత్వం" చెప్పిన పసునూరి శ్రీధర్ బాబు గురించి, మనిషిం కవిత్వం= త్రిపురనేని శ్రీనివాస్, ఆధ్యాత్మిక విప్లవ కవిత్వ సెల్ఫీలో 'డీ హ్యూమనైజేషన్' కవి వసీరా గురించి, సుగంబాబు కవితా మార్గాలు గురించి పరిచయం చేసిన వ్యాసాలు చక్రధర్‌కి కవిత్వం పట్ల ప్రేమను తెలియచేస్తాయి.



చక్రవాకం- ముక్కామల చక్రధర్
వెల : 200, ప్రతులకు : కే. శ్యామలాదేవి
చింతపల్లి కృష్ణమూర్తి వీధి, నారాయణపేట,
కే. అగ్రహారం, అమలాపురం,
అంబేద్కర్ కోనసీమ జిల్లా - 533201
ఫోన్ పే నంబర్ 99120 19929

కేరళలో సామాజిక కార్యకర్త రెహనా ఫాతిమా పడుకొన్నపుడు ఆవిడ కొడుకు, కూతురు ఆమె శరీరం మీద పెయింటింగ్ వేస్తున్న ఫొటోని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసింది. "పురుషుడి శరీర పైభాగం నగ్నంగా వున్నా దాన్ని లైంగిక దృష్టితో చూడని సమాజం మహిళ విషయంలో మాత్రం ఎందుకు చూస్తారు" అని. అంతే పురుష సమాజం ఆమెపై విరుచుకు పడింది. కేసులు పెట్టింది. అప్పుడు ఆమె కోర్టును ఆశ్రయించింది. కోర్టు "ఆమె శరీరం ఆమె ఇష్టం" అని తీర్పునిచ్చింది. దేశమంతా వెలిగిపోతుంది. కానీ చీకటంతా స్త్రీల జీవితాల్లోనే అని బాధపడుతున్నారు. మహిళా పక్షపాతి చక్రధర్.

ఇప్పుడు రాజకీయాలూ ఓ వ్యాపారమే. ఎన్నికల్లో గెలవడానికి ఖర్చుపెట్టిన డబ్బుని గెలిచాక అంతకు ముందు వినియోగించిన దానికంటే కొన్నిరెట్లు సంపాదించడమే ఈనాటి చాలామంది రాజకీయ నాయకుల జీవన లక్ష్యాలు. ఈ క్రమంలో విలువలు, నీతులు అన్నిటినీ వదిలేస్తున్నారు ఈనాటి స్వార్థపరులు. వీరిని వర్ణిస్తూ "కరవేపాకు రాజకీయాలు" వ్యాసంలో "ఉప్మా చాలా బాగుంది. కరివేపాకు రెబ్బలు ఎక్కువ వేసారేమో ఆ "కమ్మ" దనం మరీ బాగుంది" అంటారు. దీనిలో వున్న వ్యంగ్యం గురించి, ఆట్టే వివరించక్కర్లేదు. అందరికీ అర్థమయ్యే వుంటుంది ఈపాటికి.

ఇప్పటి పిల్లలకు బాల్యం రెక్కలు కత్తిరించేస్తున్నాం. బాల్యం నుంచీ గ్రేడ్లు, మార్కులు. ఇదే వారి ఉన్నతాదర్శాలు ఆటలుండవు పాటలుండవు. పాఠాలు తప్ప. ఇవన్నీ చూసి కలత చెందిన మనసుతో చక్రధర్ రాసిందే "బంగారు బాల్యాన్ని చదివేస్తున్నామా...!!" కాలమ్. మనది ప్రజాస్వామ్య ప్రభుత్వం. ప్రజల కొరకు ప్రజల చేత, ప్రజల యొక్క ప్రభుత్వం. కానీ విచిత్రమేమిటంటే ప్రజాస్వామ్య పదంలో ప్రజలకే ప్రాముఖ్యం ఉండదు. వ్యవసాయం పనికిమాలిన వృత్తిగా మారింది. రైతుకు పిల్లనిచ్చేవాళ్ళు కరువయ్యారు. అందరికీ అన్నంపెట్టే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ ఆవేదనంతా "దింపుడు కళ్ళెం ఆశలు" లో వర్ణిస్తారు.

పెట్టుబడికీ, కట్టుకథకీ పుట్టిన విషపుత్రిక అన్నాడు శ్రీశ్రీ. అలాంటి వ్యాపార ప్రయోజనాల కోసమే చాలా పత్రికలు పని చేస్తున్నపుడు ప్రజల తరపున పోరాడుతూ ఒక సిద్ధాంతానికి కట్టుబడి 70 ఏళ్ళు ఒక పత్రిక పని చేస్తుండటం ఎంతో గొప్ప విషయం. అలాంటి పత్రిక విశాలాంధ్ర గురించి ఓ ప్రజా పత్రిక పుట్టిన రోజులో విశాలాంధ్ర సాధించిన విజయాలను నిండు మనసుతో అందించారు పాఠకులకు. కార్టూనిస్ట్ మోహన్, సినిమా నటులు జమున, సూర్యకాంతం, చలపతిరావు, కృష్ణ గురించి రాసినవి మనకు తెలియని ఎన్నో విషయాలు తెలియచేస్తాయి.

"మందరపుగానం-ఇంద్రగంటి పురస్కారం" లో ప్రముఖ కవి శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత శర్మగారి కవితా వైశిష్ట్యాన్ని తెలుపుతూ నా కవిత్వం గురించి గూడా ప్రస్తావించినందుకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు చెప్పకుండా ఎలా ఉండగలను! చక్రవాకం వర్తమాన సమాజానికి దర్పణం. "చక్రవాకంలో ఒక్కొక్క కాలం చదువుతున్నప్పుడు 30 ఏళ్ళు కలం పట్టకుండా తదేక దీక్షతో చదువుకున్న సారం కనిపిస్తుంది. అక్షరాలతో ఆడుకుంటారు. వాక్యాలతో విన్యాసం చేయిస్తారు. వ్యంగ్యం అదనపు మెరుపు. ప్రతి శీర్షికా కొత్తగా వుంటుంది. ప్రారంభం, ముగింపు అద్భుతంగా, ఆశ్చర్యభరితంగా వుంటాయి. ఈ రాగాలను అత్యద్భుతంగా పలికించి, పరవశింప చేసిన శ్రీ చక్రధర్‌కి హృదయపూర్వక అభినందనలు.

ముందుకు మున్ముందుకు సాగు మదురో

-డా॥తక్కోలు మాచిరెడ్డి
సెల్: 7569693239

ముచ్చటగా మూడవసారి ఎన్నికయ్యావు
వెనిజువేలా అధ్యక్షుడివిగా
అందుకో మా అభినందనలు
కామ్రేడ్ మదురో!
నీ ఎన్నిక చెల్లదంట
అంటోంది అసంరా
రష్యా చైనా ఇరాన్ దేశాలు
ప్రశంసిస్తున్నాయి నిన్ను
అభినందిస్తూ సంతసిస్తున్నాయి
నీ అపార చమురు సంపదను
అసంరా దోచుకోలేదు
క్యూబా ఆదర్శంగా
జనతా ప్రజాస్వామ్య దిశగా
ముందుకు మున్ముందుకు
సాగు మదురో
వేగు చుక్కలా
ఓవెల్తురు మొక్కలా

మాయమైన సంపాదకుడు

మంచి పుస్తకం

పత్రికలు సమాజానికి దర్పణం అంటాం. కానీ గత పదేళ్ల కాలంలో పెద్ద పత్రికలు, మీడియా సంస్థలు ప్రభుత్వానికి ఊడిగం చేయడంలో నిమగ్నమై ఉన్నాయి. ఈ ఊడిగం స్వచ్ఛందమైందే. ప్రభుత్వం బలవంత పెట్టడం వల్ల చేస్తున్న ఊడిగం కాదిది. ప్రభుత్వపక్షం కొమ్ము గాసే మీడియా సంస్థలు ఇంతకు ముందూ ఉన్నాయి. కానీ అవి ఇప్పుడు అనుసరిస్తున్న బాహాటమైన ప్రభుత్వ అనుకూల వైఖరిని అనుసరించేవి కావు. ఎమర్జెన్సీ సమయంలో పత్రికా స్వేచ్ఛను హరించడం చూశాం. ఇప్పుడు బహిరంగంగా ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలు లేకపోవచ్చు. కానీ ప్రభుత్వాన్ని సమర్థిస్తే తప్ప మనుగడ సాగించలేని పరిస్థితి దాపురించింది. ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ప్రజల తరఫున మాట్లాడే పత్రికా రచయితలు ప్రధాన స్రవంతి నుంచి తప్పుకుంటూ సొంతంగా యూ ట్యూబ్ చానళ్ల లాంటివి నడుపుతూ నిత్య పోరాటానికి సిద్ధపడాల్సిందే. అలాంటి వ్యవస్థల మీద ప్రభుత్వానికి బాకా ఊదే వర్గాలు పెద్ద ఎత్తున దాడి చేస్తున్నాయి.

ఇదంతా భావప్రకటనా స్వేచ్ఛ పరిమితమై పోవడానికే నిదర్శనం. ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పక్షాలు విమర్శను తట్టుకునే స్థితిలో లేవు. ఎదుటి పక్షం వాదనను కనీసం వినిపించుకునే స్థితిలోనైనా లేవు. అసమ్మతి వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యం హక్కు. ప్రజాస్వామ్యం నామమాత్రంగా తయారైన సమయంలో అసమ్మతిని సహించే పరిస్థితి ఎటూ లేదు. అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితిని ప్రోత్సహిస్తున్న వర్గాలు ఎమర్జెన్సీ హయాంలో తీవ్ర నిరసన వ్యక్తం చేసిన వర్గాలే. విద్వేష పూరిత వాతావరణం మీడియానూ ఆవహించింది. ఈ వాదనను అంగీకరించే వారు అతి స్వల్పమే. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత నిజం మాట్లాడే పత్రికా రచయితలను దేశద్రోహులుగా చిత్రించి జైళ్లలోకి తోస్తున్నారు. ఈ దారుణ స్థితిలో సమాజం నిట్ట నిలువునా చీలిపోతోంది. ఈ చీలికలు మీడియాలోను ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

ప్రసిద్ధ పత్రికా రచయిత రుబేన్ బెనర్జీ ఈ పరిస్థితిని అంతటినీ గుది గుచ్చి "మిస్సింగ్ ఎడిటర్" అన్న గ్రంథం రాశారు. రుబిన్ బెనర్జీ అనుభవజ్ఞుడైన పత్రికా రచయిత. అనేక పెద్ద మీడియావ్యవస్థల్లో పనిచేసినందువల్ల జరుగుతున్న పరిణామాలను నిరపేక్ష దృష్టితో చూడగలిగిన సమర్థుడు. మీడియా ప్రమాణాలు పాతాళంలోకి పడిపోవడాన్ని ఆయన తన వృత్తిరీత్యా దగ్గరనుంచి పరిశీలించినవారు. ఈ గ్రంథంలో ఆయన పడిపోతున్న మీడియా ప్రమాణాలు, నాణ్యత, నిరపేక్షత ఎంత ఘోరంగా లుప్తమవుతుందో వివరించారు. సమకాలీన స్థితిలో విపరిణామాలను ఆయన స్వయంగా చూసినవాడు. ఆ మాటకొస్తే స్వయంగా ఆ ప్రతికూల పరిస్థితులను అనుభవించిన వాడు. ఈ పుస్తకం చదివితే సత్యం తరఫున నిలబడడం ఎంత దుర్లభంగా తయారైందో అర్థం అవుతుంది. జర్నలిస్టుగా తన జీవితంలోనే అనేక ఎగుడుదిగుళ్లను చూసినవాడు. ఔట్‌లుక్ పత్రిక ప్రధాన సంపాదకుడిగా ఆయన అనేకసవాళ్లు ఎదుర్కోవలసి వచ్చింది. చివరకు అవమానపడి ఆ ఉద్యోగం మానుకోవలసి వచ్చింది.

రుబేన్ బెనర్జీ హైదరాబాద్ నుంచి "ఈనాడు" సంస్థ నడిపి ఆపేసిన న్యూస్ టైం పత్రికలో విలేకరిగా తన పత్రికా రచన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఇండియా టుడే పత్రికల్లోనూ పని చేశారు. ఆయన వృత్తి జీవితం అనేక రాష్ట్రాలకు విస్తరించింది. ఆ తరవాత విదేశాలకు వెళ్లి దోహాలో దమ్మున్న అల్‌జజీరాలో పనిచేశారు. స్వదేశం తిరిగి వచ్చిన తరవాత హిందుస్థాన్ టైమ్స్ విలేకరుల వ్యవస్థకు నాయకత్వం వహించారు. హిందుస్థాన్ టైమ్స్‌లో సంపాదకుడి గానూ కొంతకాలం పనిచేశారు. ఆ తరవాత ఔట్‌లుక్‌లో చేరారు.

"మిస్సింగ్ ఎడిటర్" ఆయన రాసిన మూడో గ్రంథం. అంతకు ముందు "ఒరిస్సా ట్రాజెడీ: ఎ సైక్లోన్స్ ఇయర్ ఆఫ్ కలామిటీ రాశారు. మొన్నటి దాకా ఒరిస్సా ముఖ్యమంత్రిగా ఉన్న నవీన్ పట్నాయక్ జీవిత చరిత్ర రాశారు. "ఇండియాలో



పత్రికా రచనలో ఎంత మకిలి పేరుకుపోయిందో రాశాను. పత్రికా రచన మునుపటి పూర్వస్థితికి వస్తుందా అన్న అనుమానం ఉంది" అని రాశారు. ఈ మాటలు ఆయన ఆవేదన ప్రతిఫలనే.

సమాజ గమనానికి అద్దం పట్టాల్సిన పత్రికలు జరుగుతున్న మంచినీ చెప్పాలి. అధికార పక్షం తప్పులనూ ఎత్తి చూపాలి. ప్రజల మనోభావాలను ప్రతిబింబించాలి. వారి కష్ట నష్టాలను ప్రతిబింబించాలి. స్వతంత్ర భారత పత్రిక రంగం అనేక ఆటుపోట్లను ఎదుర్కోవలసి వచ్చింది. ప్రభుత్వ నిర్బంధాలూ తప్పలేదు. ప్రభుత్వ అరాచకాల గురించి రాసిన పత్రికా రచయితలు అధికారంలో ఉన్న వారి ఆగ్రహాన్ని చవి చూడవలసి వచ్చింది. భారీ మూల్యమే చెల్లించవలసి వచ్చింది. కొన్ని సార్లు మీడియా నిర్వర్తించవలసిన అసలు బాధ్యతతో రాజీ పడవలసిన సందర్భాలూ ఎదురయ్యాయి.

సంపాదక స్థానంలో ఉన్న వారు అధికారంలో ఉన్న వారి కోపతాపాలకు గురి కావడమే కాక మీడియా సంస్థ యజమానుల నుంచి ఎదురయ్యే ఇబ్బందులనూ భరించాల్సి వస్తుంది. ఏ పత్రికకైనా సంపాదకుడు చుక్కాని లాంటి వాడు. పత్రిక అనుసరించవలసిన విధానాన్ని రూపొందించి అమలు చేసే బాధ్యత నిస్సందేహంగా సంపాదకుడిదే. కానీ యజమానులే సంపాదకులై కూర్చుంటున్న రోజుల్లో మనం ఉన్నాం. పేరుకు సంపాదకుడు ఉన్నప్పటికీ సంపాదకుడికి ఉండే స్వేచ్ఛ, పత్రికా స్వాతంత్ర్యం యజమానుల ఇచ్ఛకు పరిమితమైన సమయంలో సంపాదకుడు మనుగడ కొనసాగించవలసిన దుస్థితిలో ఉన్నాం. సంపాదకుడు నిరంకుశంగా వ్యవహరించాలని కాదు గానీ తన వృత్తి ధర్మాన్ని నిర్వహించ లేని స్థితిలో ఉండడం అంటే సంపాదకుడి అస్తిత్వం లేనట్టే లెక్క. ఈ దుస్థితినే రుబేన్ బెనర్జీ ఈ గ్రంథంలో రూపు కట్టించారు. సంపాదక వ్యవస్థ మాయమైన తీరును రుబేన్ బెనర్జీ ఈ గ్రంథంలో వర్ణించారు. 2021 మే 24 నాటి ఔట్ లుక్ పత్రిక ముఖ చిత్రం మీద "మిస్సింగ్" అని శీర్షిక పెట్టాడు. దాని కింద మూడు పంక్తులు రాశాడు. అవి ఇలా ఉన్నాయి. "పేరు: భారత ప్రభుత్వం. వయసు ఏడేళ్లు. లక్ష్యం: ప్రజలకు సమాచారం అందించడం. ఈ మూడు లైన్లు రాయడాన్ని మెచ్చుకున్న వారూ ఉన్నారు. దుయ్యబట్టిన వారూ ఉన్నారు. రెండవ సారి కరోనా మహమ్మారి దాడి చేసినప్పుడు రుబేన్ బెనర్జీ ఈ ప్రయోగం చేశారు. కరోనా నుంచి ప్రజలను కాపాడవలసిన ప్రభుత్వం ఎంత ఘోరంగా విఫలమైందో ఎత్తి చూపారు. ఈ మూడు పంక్తులూ చదివితే కరోనా మహమ్మారి ఉధృతంగా ఉన్నప్పుడు ప్రభుత్వ చేతకానితనం ఎంత భయంకరంగా ఉందో ఇప్పటికీ కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. ఈ సంచిక ఔట్ లుక్ సంపాదకుడిగా ఆయన ఉద్యోగం ఊడడానికి మాత్రమే తోడ్పడింది. అందుకే ఆయన ఈ గ్రంథానికి "మిస్సింగ్ ఎడిటర్" అని పేరు పెట్టినట్టున్నారు.

నిజం చెప్పినందుకు ఆయన ఉద్యోగం ఊడడం మన మీడియా ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితులకు చిహ్నం. మీడియా రంగంలో ఇప్పుడు పోటీ బాగా పెరిగిపోయింది. నిర్వహణా ఖర్చులూ పెరిగిపోయాయి. లాభ నష్టాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే మీడియా సంస్థల యజమానులు ప్రభుత్వం మీద ఆధారపడే పరిస్థితి మొదలైంది. వివిధ పత్రికా సంస్థల మీద ప్రభుత్వం ఎడా పెడా దాడులకు దిగుతున్నప్పుడు యజమానులకు ఆ పరిస్థితిని ఎదుర్కొనే సాహసం ఉంటుందనుకోవడం భ్రమే. ఇలాంటి స్థితిలో సంపాదకుడు మాయంకాక మరేం అవుతుంది!

ఆర్వీ రామారావ్

మూడు నెలల్లో వందే భారత్ స్లీపర్ రైళ్లు

అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ: వందేభారత్ ఎక్స్‌ప్రెస్ స్లీపర్ రైళ్లను త్వరలోనే పట్టాలు ఎక్కించేందుకు రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో వందే భారత్ స్లీపర్ కోచ్ ప్రొటోటైప్ వెర్షన్‌ను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆవిష్కరించారు. బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ ఫెసిలిటీలో వీటిని ప్రారంభించారు. బీఎమ్ఈఎల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వందే భారత్ తయారీ కేంద్రానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 'ఈ రోజు ముఖ్యమైన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నాం. వందే భారత్ చైర్ కార్ విజయవంతమైన తర్వాత, వందే భారత్ స్లీపర్ కోసం చాలా శ్రమించాం. వీటి తయారీ ఇప్పుడే పూర్తయింది. పది రోజుల పాటు వీటిపై కఠినమైన ట్రయల్స్, టెస్ట్‌లు నిర్వహించనున్నాం' అని వైష్ణవ్ చెప్పారు. రానున్న మూడు నెలల్లో ప్రయాణికులకు ఈ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. 16 కోచ్‌లు, 823 బెర్త్‌లతో స్లీపర్ రైలు రానుంది. వీటిలో 11.. 3టైర్ ఏసీ కోచ్‌లు (600 బెర్త్‌లు), 4.. 2 టైర్ ఏసీ కోచ్‌లు (188 బెర్త్‌లు), ఒక ఫస్ట్ టైర్ ఏసీ కోచ్(24 బెర్త్‌లు) ఉంటుంది. వందే భారత్ రైళ్లు మూడు వెర్షన్లలో రానున్నాయి. ఇప్పటికే సెమీ హైస్పీడ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ చైర్‌కార్ రైళ్లు దేశవ్యాప్తంగా వివిధ నగరాల మధ్య సర్వీసులను అందిస్తున్నాయి. ఎక్కువ దూరం ప్రయాణించే వారికి మెరుగైన సదుపాయాలు అందించడం కోసం ఈ స్లీపర్ వెర్షన్‌ను కొన్ని నెలల్లోనే పట్టాలెక్కించనున్నారు.

జస్టిస్ హేమ కమిటీ నివేదికను స్వాగతిస్తున్నా: మమ్ముట్టి

తిరువనంతపురం: హేమ కమిటీ నివేదిక మలయాళ చిత్ర పరిశ్రమను కుదిపేస్తోంది. ఈ నివేదికపై ప్రముఖ మలయాళ నటుడు మమ్ముట్టి స్పందించారు. దీనిపై తాజాగా ఆయన ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టారు. షూటింగ్ ప్రదేశాల్లో మహిళలకు సురక్షిత వాతావరణం కలిగించేందుకు నివేదికలో చేసిన సూచనలను స్వాగతిస్తున్నామని తెలిపారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా చేయాల్సిన బాధ్యత అందరికీ ఉందన్నారు. 'సెట్‌లో మహిళలకు ఇబ్బందికర ఘటనలు ఏమీ జరగకుండా దర్శక నిర్మాతలు జాగ్రత్తలు తీసుకోవాలి. సినీ పరిశ్రమ గురించి అధ్యయనం చేసి, నివేదిక సిద్ధం చేసి, పరిష్కారాలు సూచించడానికి ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని ఏర్పాటు చేసింది. మహిళలకు ఇలాంటి పరిస్థితులు ఎదురు కాకుండా ఉండేలా ఆ నివేదికలో పేర్కొన్న సూచనలు, పరిష్కారాలను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నా. వాటిని అమలు చేసేందుకు చిత్ర పరిశ్రమలోని అన్ని అసోసియేషన్‌లు ఏకతాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైంది. తాజాగా అందిన ఫిర్యాదులపై పోలీసు విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. జస్టిస్ హేమ కమిటీ నివేదిక కోర్టు ముందు ఉంది. దర్యాప్తు జరగనివ్వండి. నిందితులకు తగిన శిక్షలను న్యాయస్థానం నిర్ణయిస్తుంది. సినీ పరిశ్రమలో 'పవర్ సెంటర్' అనేది లేదు. అంతిమంగా సినిమా అనేది బతకాలి' అని మమ్ముట్టి పేర్కొన్నారు. మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులను తెలియజేస్తూ జస్టిస్ హేమ కమిటీ ఒక నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ప్రస్తుతం ఇది అంతటా చర్చనీయాశంగా మారింది.

సిబల్ వ్యాఖ్యలు బాధాకరం: ధన్కర్

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనపై సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ చేసిన వ్యాఖ్యలపై ఉపరాష్ట్రపతి ధన్కర్ ఎదురుదాడికి దిగారు. ఈ ఘటన సర్వసాధారణమంటూ సిబల్ మాట్లాడినందుకు క్షమాపణ చెప్పాలన్నారు. ఉన్నతస్థాయిలో ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడటం తగదన్నారు. 'ఆస్పత్రిలో వైద్యురాలి హత్యాచార ఘటన మానవత్వానికి సిగ్గుచేటు. బాధితురాలికి జరిగిన అన్యాయంపై కొందరు చేస్తున్న వ్యాఖ్యలు ఆ బాధను మరింత పెంచుతున్నాయి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడి స్థానంలో ఉన్న సిబల్ ఇలా మాట్లాడడం బాధాకరం' అని ధన్కర్ వ్యాఖ్యానించారు.

మోదీ క్షమాపణల్లోనూ అహంకారం

- శివాజీ విగ్రహం ఏర్పాటులో భారీ అవినీతి
- ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్ విమర్శ

ముంబై: మహారాష్ట్రలోని తీరప్రాంత జిల్లా సింధుదుర్గ్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ప్రారంభించిన తొమ్మిది నెలల్లో కూలడం తీవ్ర వివాదాస్పదమైంది. ఈ ఘటనను నిరసిస్తూ ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి ఆదివారం ముంబైలో ఆందోళన చేపట్టింది. హుతాత్మ చౌక్ నుంచి గేట్‌వే ఆఫ్ ఇండియా వరకు విపక్ష నేతలు ర్యాలీ చేపట్టారు. ఇందులో ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలే, ముంబై అధ్యక్షుడు వర్ష గైక్వాడ్ తదితరులు పాల్గొన్నారు. గేట్‌వే ఆఫ్ ఇండియా వద్ద జరిగిన సభలో విపక్ష నేతలు ప్రధాని మోదీ, మహారాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. విగ్రహం కూలడంపై మోదీ క్షమాపణ చెప్పడం అహంకారంగానే కనిపించిందని ఠాక్రే ఆరోపించగా... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవినీతికి ఇది తాజా ఉదాహరణ అని శరద్ పవార్ విమర్శించారు. విగ్రహం కూలడంపై మోదీ క్షమాపణలు చెప్పడంపై మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే స్పందిస్తూ 'మోదీ క్షమాపణల్లో అహంకారాన్ని గుర్తించారా? అది ముమ్మాటికీ అహంకారమే. ఆయన క్షమాపణలు చెబుతుంటే... పక్కన నిల్చున్న ఉపముఖ్యమంత్రి ఒకరు నవ్వుతూ కన్పించారు. విగ్రహం కూలడం అంటే మహారాష్ట్ర ఆత్మకు అవమానం జరిగినట్లే. ఇందులో భారీ అవినీతి జరిగింది. శివాజీ మహారాజ్‌ను అవమానించిన వారిని తప్పకుండా ఓడిస్తాం' అని ఠాక్రే అన్నారు. అనంతరం శరద్ పవార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతున్న అవినీతికి నిదర్శనమే ఈ ఘటన అని మండిపడ్డారు. విగ్రహం కూలడమంటే శివాజీ మహారాజ్‌ను అవమానించడమేనన్నారు. ర్యాలీలో కాంగ్రెస్, ఎన్‌సీపీ, శివసేన(ఉద్ధవ్) పార్టీలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గతేడాది నేవీ డే (డిసెంబరు 4) సందర్భంగా రాజ్‌కోట్ కోటలో ప్రధాని మోదీ ఈ విగ్రహాన్ని ఆవిష్కరించగా... ఆగస్టు 26న ఇది కూలిపోయింది.

ఏడాది తిరగకముందే విగ్రహం కూలడంపై విపక్షాలు పెద్దఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వర్షాల కారణంగానే విగ్రహం కూలినట్లు భావిస్తున్నా... దీని వెనుక లోపాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ఇక్కడ 35 అడుగుల శివాజీ విగ్రహం ఏర్పాటుకు అనుమతులే ఇవ్వలేదని మహారాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ ఆర్ట్స్ సంచాలకులు రాజీవ్ మిశ్రా చెప్పడం చర్చనీయాంశమైంది. ఇటీవల మహారాష్ట్రలో పర్యటించిన మోదీ మాట్లాడుతూ 'ఛత్రపతి శివాజీ మహారాజ్ అంటే కేవలం ఒక రాజు పేరు మాత్రమే కాదు. ఆయన మన దైవం. నేడు ఆయన పాదాల ముందు తల వంచి నా దైవాన్ని క్షమాపణలు కోరుతున్నా' అని అన్నారు.

శివాజీ పేరుతో రాజకీయాలు చేయొద్దు

జరంగే డిమాండ్

మాల్వాన్ : ఛత్రపతి శివాజీ మహారాజ్ పేరుతో రాజకీయాలు చేయవద్దని, రాష్ట్ర, జాతీయ చిహ్నాలను అవమానించే వారిని కఠినంగా శిక్షించాలని మరాఠా కోటా కార్యకర్త మనోజ్ జరంగే ఆదివారం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆగస్టు 26న కూలిపోయిన 17వ శతాబ్దానికి చెందిన మరాఠా యోధ రాజు 35 అడుగుల విగ్రహాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించిన మాల్వాన్‌లోని రాజ్‌కోట్ కోటను ఆగస్టు 26న జరంగే సందర్శించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై ప్రధాని క్షమాపణలు చెప్పారు. ఇక్కడ జరంగే విలేకరులతో మాట్లాడుతూ 'దీనిపై ప్రతిపక్షం, ప్రభుత్వం రెండూ రాజకీయాలు చేయకూడదు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలి. కాంట్రాక్టర్లను వదిలిపెట్టకూడదు' అని అన్నారు. శివాజీ పేరుతో ప్రతిపక్షం, మహాయుత ప్రభుత్వం రెండూ రాజకీయాలు చేస్తున్నాయన్నారు. 'చట్టం ఉండాలి. చిహ్నాలను అవమానించే వారు జైలుకు వెళ్లాలి' అని కోటా కార్యకర్త అన్నారు. రాజ్‌కోట్ కోటకు ఎక్కువ కాలం ఉండే శివాజీ విగ్రహం అవసరమని ఆయన పేర్కొన్నారు. శివాజీ మహారాజ్ విగ్రహం కూలిపోయిన ఘటనకు నిరసనగా మహా వికాస్ అఘాడి ఆదివారం పాదయాత్ర నిర్వహించింది. ఈ ఘటనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిందించారు.

బెంగాల్‌లో మరో దారుణం

రాత్రి విధుల్లో ఉన్న నర్సుపై వేధింపులు

ఇంటర్నెట్ డెస్క్: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా దుమారం రేపుతున్న వేళ బెంగాల్‌లో మరో నర్సు నైట్‌షిఫ్టులో వేధింపులు ఎదుర్కోవడం కలకలం రేపుతోంది. బీర్భమ్ జిల్లాలోని ప్రభుత్వాసుపత్రిలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. చోటోచక్ గ్రామానికి చెందిన అబ్బాస్ ఉద్దిన్‌కు జ్వరం రావడంతో అతడి కుటుంబసభ్యులు నిన్న రాత్రి 8.30 గంటలకు ఆసుపత్రికి తీసుకొచ్చారు. అతడిని పరీక్షించిన వైద్యులు సెలైన్ ఎక్కించడం కోసం వార్డుకు తరలించారు. అక్కడ విధుల్లో ఉన్న ఓ మహిళా నర్సు అతడికి సెలైన్ బాటిల్ ఎక్కిస్తుండగా ఆ రోగి అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె ఆసుపత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ వ్యక్తి తనను అభ్యంతరకరంగా తాకడంతో పాటు అసభ్య పదజాలంతో మాట్లాడినట్లు నర్సు ఆరోపించారు. ఆ ఘటనతో తాను భయభ్రాంతులకు గురయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులు హెచ్చరించినా అతడు వినిపించుకోలేదు. దీంతో వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీటీ స్కాన్‌కు వెళ్లిన బాలికపై...

హవ్‌డాలో మరో ఘటన వెలుగుచూసింది. ఓ 14 ఏళ్ల బాలికపై ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ వేధింపులకు పాల్పడ్డాడు. నిమోనియాతో బాధపడుతున్న ఆమె హవ్‌డా సర్దార్ ఆసుపత్రిలో సీటీ స్కాన్ కోసం వెళ్లగా... ల్యాబ్‌లో పనిచేస్తున్న ఓ వ్యక్తి ఆమెతో అభ్యంతరకరంగా ప్రవర్తించాడు. భయంతో బాలిక కేకలు వేయడంతో గమనించిన కుటుంబసభ్యులు ఆమెను రక్షించారు. ఈ ఘటనతో బాధితురాలి బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. నిందితుడిపై దాడికి యత్నించారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని నిందితుడిని అరెస్టు చేశారు. వరుస ఘటనలతో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు తీవ్రమవుతున్నాయి.

టీఎంసీకి ఎదురుదెబ్బ

అసోం పార్టీ అధ్యక్షుడు రాజీనామా



గువహతి: తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి అసోంలో ఎదురుదెబ్బ తగిలింది. అసోం టీఎంసీ పార్టీ అధ్యక్షుడు రిపున్ బోరా ఆదివారం పార్టీకి రాజీనామా చేశారు. అసోం ప్రజలు టీఎంసీని పశ్చిమ బెంగాల్‌లోని 'ప్రాంతీయ పార్టీ'గా పరిగణిస్తున్నారని, కానీ అసోంలో తమ పార్టీగా అంగీకరించడానికి ఇష్టపడటం లేదని ఆయన అన్నారు. అంతేకాకుండా అసోంలో టీఎంసీకి ఆమోదయోగ్యంగా ఉండాలని పార్టీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి అనేక సూచనలు చేశామని గుర్తుచేశారు. అయినప్పటికీ వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి రాసిన లేఖలో రిపున్ బోరా స్పష్టం చేశారు. జాతీయస్థాయిలో అస్సామీ నేతను చేర్చుకోవాలని, కోల్‌కతాలోని టోలీగంజ్‌లోని భారతరత్న డాక్టర్ భూపేన్ హజారికా నివాసాన్ని వారసత్వ ప్రదేశంగా ప్రకటించాలని కోరినట్లు తెలిపారు. కూచ్ బెహార్‌లోని మధుపూర్ సత్రాన్ని సాంస్కృతిక కేంద్రంగా మార్చాలని సూచించినట్లు తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఏడాదిన్నర కాలంగా అభిషేక్ బెనర్జీ, మమతా బెనర్జీని కలవాలని ప్రయత్నించినా సఫలం కాలేదని రిపున్ బోరా తెలిపారు. రెండేళ్లకు పైగా టీఎంసీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆయన ఈ సమయంలోనే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకుంటున్నారు. కొన్ని పునరావృత సమస్యలు తమ పురోగతికి ఆటంకం కలిగిస్తున్నాయన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు, అసోంలో టీఎంసీకి ఆమోదయోగ్యంగా ఉండాలని పార్టీ అధిష్టానానికి, మమతా బెనర్జీకి అనేక సూచనలు ఇచ్చామన్నారు. కానీ అవి కూడా అమలు కాలేదని చెప్పారు. తాను రెండేళ్లకు పైగా అసోం టీఎంసీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశానని, ఈ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలతో విస్తృతంగా సంభాషించానని చెప్పారు. దురదృష్టవశాత్తూ అనేక అంశాల పెండింగ్ నేపథ్యంలో అసోంలోని చాలామంది ప్రజలు టీఎంసీని పశ్చిమ బెంగాల్ ప్రాంతీయ పార్టీగా చూడడానికి దారితీశాయన్నారు. అసోం ప్రజలు వేరే రాష్ట్రానికి చెందిన పార్టీని అంగీకరించడానికి ఇష్టపడటం లేదన్నారు. అనేక సవాళ్లకు తగిన పరిష్కారం లేకపోవడంతో తాను ఈ కఠిన నిర్ణయం తీసుకోవలసి వచ్చిందన్నారు.

వయనాడ్‌లో పర్యాటక పునరుజ్జీవనానికి సమష్టి కృషి

రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : ఇటీవలి కొండచరియలు విరిగిపడిన నేపథ్యంలో వయనాడ్‌లో పర్యాటకాన్ని పునరుజ్జీవింపజేసేందుకు, ఆ ప్రాంతాన్ని సందర్శించేలా ప్రజలను ప్రోత్సహించడం అత్యవసరమని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆదివారం అన్నారు. కొంతమంది కేరళ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాతో జరిగిన వర్చువల్ సమావేశంలో గాంధీ ఈ ప్రకటన చేశారు. వయనాడ్‌లో సహాయ, పునరావాస ప్రయత్నాలపై ఆన్‌లైన్ సమావేశానికి చెందిన వీడియో దృశ్యంతో పాటు 'ఎక్స్' లో ఒక పోస్ట్‌లో గాంధీ, కొండచరియలు విరిగిపడటం వలన సంభవించిన విధ్వంసం నుంచి వయనాడ్ క్రమంగా కోలుకుంటున్నట్లు చెప్పారు. 'ఇంకా చాలా చేయాల్సి ఉండగా అన్ని సంఘాలు, సంస్థల నుంచి ప్రజలు సహాయక చర్యలలో కలిసి రావడం సంతోషదాయకంగా ఉంది' అని ఆయన అన్నారు. 'వయనాడ్ ప్రజలకు గొప్పగా సహాయపడే ఒక కీలకమైన పర్యాటకం అంశాన్ని నేను ప్రత్యేకంగా ప్రస్తావించాలనుకుంటున్నాను. వర్షాలు ఆగిపోయిన తర్వాత ఈ ప్రాంతంలో పర్యాటకాన్ని పునరుజ్జీవింపజేయడానికి, ప్రజలను సందర్శించడానికి ప్రోత్సహించడానికి మనం గట్టి ప్రయత్నం చేయడం అత్యవసరం' అని కాంగ్రెస్ అగ్ర నేత అన్నారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతం వయనాడ్‌లోని ఒక నిర్దిష్ట ప్రాంతానికి పరిమితమన్న విషయాన్ని గమనించడం ముఖ్యమని, మొత్తం ప్రాంతానికి కాదని తెలిపారు. 'వయనాడ్ ఒక అద్భుతమైన గమ్యస్థానంగా మిగిలిపోయింది. భారతదేశం, ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే పర్యాటకులను దాని సహజ శోభతో స్వాగతించడానికి త్వరలో సిద్ధంగా ఉంటుందని గాంధీ చెప్పారు. గతంలో మాదిరిగానే అందమైన వయనాడ్‌లో ఉన్న మన సోదర సోదరీమణులను ఆదుకునేందుకు మరోసారి కలిసి రావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో గాంధీ మాట్లాడుతూ పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి ఇది సురక్షితమైన ప్రదేశం కాదనే భావనను తొలగించడం చాలా ముఖ్యమన్నారు. ఎందుకంటే ఇది 'ప్రమాదకరమైన ప్రదేశం' అని ప్రజలు భావిస్తే అది వయనాడ్ బ్రాండ్‌ను దెబ్బతీస్తుందని తెలిపారు. 'మనం ఒత్తిడి తీసుకురావాల్సిన నాలుగైదు అంశాలు ఉన్నాయి. సహాయ, పునరావాసంపై శాఖల మధ్య సమన్వయం, సరిపోని పరిహారం, నేను లేవనెత్తిన అద్దె సమస్య, చాలా మంది జీవనోపాధి కోల్పోయారు. చివరకు పర్యాటకంపై ప్రభావం' అని రాహుల్ చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో గాంధీ రెండు నియోజకవర్గాల నుంచి గెలుపొందారు. కానీ కేరళలోని వయనాడ్ స్థానానికి రాజీనామా చేశారు. అక్కడ నుంచి ఆయన సోదరి ప్రియాంక గాంధీ ఉప ఎన్నికలో పోటీ చేయనున్నారు.

జమ్మూకశ్మీర్ యువతకు బీజేపీ మోసం: ఖర్గే



న్యూఢిల్లీ : జమ్మూకశ్మీర్ యువతను 'వంచించడమే' బీజేపీ అనుసరిస్తున్న ఏకైక విధానమని, రాబోయే ఎన్నికల్లో 'ప్రధాని నరేంద్ర మోదీ అండ్ కంపెనీ'కి ఎగ్జిట్ డోర్ చూపిస్తారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం అన్నారు. ఒక 'ఎక్స్' పోస్ట్‌లో, 'జమ్మూకశ్మీర్‌లో యువత నిరుద్యోగం రేటు మార్చిలో 28.2 శాతంగా ఉంది. జమ్మూకశ్మీర్ యువత విషయంలో బీజేపీ అనుసరిస్తున్న ఏకైక విధానం మోసం!' అని పేర్కొన్నారు. 'అనేక పరీక్షా పత్రాల లీక్‌లు, లంచాలు, ప్రబలమైన అవినీతి కారణంగా నాలుగు సంవత్సరాలుగా విభాగాల్లో నియామకాలు ఆలస్యం అయ్యాయి. జమ్మూకశ్మీర్‌లో ఆశ్చర్యకరంగా 65 శాతం ప్రభుత్వ శాఖ పోస్టులు 2019 నుంచి ఖాళీగా ఉన్నాయి' అని తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో 60 వేల మందికి పైగా ప్రభుత్వ దినసరి కూలీలు 15 ఏళ్లకు పైగా శ్రమిస్తున్నారని, రోజుకు రూ.300 మాత్రమే సంపాదిస్తున్నారని అన్నారు. వారు దీర్ఘకాలిక సేవ ఉన్నప్పటికీ వారు కాంట్రాక్టు ప్రాతిపదికన ఉన్నారని పేర్కొంటూ, విద్యుత్, ప్రజారోగ్యం, ఇంజనీరింగ్ వంటి అవసరమైన విభాగాలలో కూడా ఉద్యోగ సంక్షోభం అనిశ్చిత స్వభావాన్ని ఎత్తి చూపారు. జమ్మూకశ్మీర్‌లో పరిశ్రమలకు బీజేపీ హామీ ఇచ్చినప్పటికీ, కేంద్రపాలిత ప్రాంతంలో పెద్ద తయారీ యూనిట్లు లేవని ఆయన అన్నారు. ప్రయివేటు రంగం వ్యవసాయం, ఆతిథ్యం, ఆరోగ్యం వంటి సేవలకే పరిమితమైందన్నారు. '2021లో కొత్త పారిశ్రామిక విధానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ, కేవలం 3 శాతం పెట్టుబడులు మాత్రమే సాకారమయ్యాయి. ప్రధాన మంత్రి అభివృద్ధి ప్యాకేజీ 2015 కింద 40 శాతం ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి' అని ఖర్గే చెప్పారు. 'అక్టోబరు 1న జమ్మూకశ్మీర్ యువత మోదీ అండ్ కంపెనీకి ఎగ్జిట్ డోర్ చూపుతుంది!' అని అన్నారు. 90 మంది సభ్యులున్న జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి మూడు దశల్లో సెప్టెంబరు 18, 25, అక్టోబరు 1 తేదీల్లో ఎన్నికలు నిర్వహించి అక్టోబరు 8న ఫలితాలు ప్రకటించనున్నారు.

మణిపూర్‌లో తిరుగుబాటుదారుల కాల్పులు

మహిళ మృతి, ఆమె కుమార్తెకు, పోలీసులకు గాయాలు

ఇంఫాల్/న్యూఢిల్లీ : మణిపూర్‌లో ఆదివారం అనుమానిత తిరుగుబాటుదారులు జరిపిన కాల్పుల్లో ఒక మహిళ మరణించగా, ఆమె 12 ఏళ్ల కుమార్తె గాయపడింది. ఈ ఘటన ఇద్దరు పోలీసులు కూడా గాయపడగా, ఇద్దరూ ప్రమాదం నుంచి బయటపడ్డారని సంబంధిత వర్గాలు తెలిపాయి. కాంగ్‌పోక్పిలోని నఖుజాంగ్ గ్రామం నుంచి పశ్చిమ ఇంఫాల్‌లోని కదంగ్‌బండ్ వైపు మధ్యాహ్నం 2.35 గంటలకు కాల్పులు ప్రారంభమైనట్లు వివరించాయి. కదంగ్‌బండ్‌లోని నివాసితులు కనీసం ఒక డ్రోన్ అయినా ఆ ప్రాంతంలోని ఒక ఇంటిపై 'బాంబు' ను జారవిడిచారు. డ్రోన్ బాంబును జారవిడిచిన దృశ్యాలను వారు పంచుకున్నారు. అయితే ప్రజలు కవర్ కోసం పరుగులు తీశారని పేర్కొన్నారు. ఈ వాదనను తాము ఇంకా పరిశీలించాల్సి ఉందని భద్రతా బలగాల వర్గాలు తెలిపాయి. కదంగ్‌బండ్‌లోని తమ ఇళ్లకు కాపలాగా ఉన్న కొందరు ప్రతీకారం తీర్చుకున్నారని వివరించాయి. కాంగ్‌పోక్పికి 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లోని రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) లో నన్‌గ్‌బామ్ సుర్బాలా (31) అనే మహిళ మరణించింది. కాంగ్‌పోక్పి అనేది కుకీ ఆధిపత్య ప్రాంతం. తూర్పు ఇంఫాల్ మైతేయి ఆధిపత్య లోయలో ఉంది.

కుకీ తెగలు, మైతేయి సామాజిక వర్గం మే 2023 నుంచి అనేక సమస్యలపై పోరాడుతున్నాయి. 'కుకీ ఉగ్రవాదులు' మహిళను హతమార్చారని మైతేయి సభ్యులు పేర్కొంటుండగా, కుకీ తెగకు చెందిన సోషల్ మీడియా వినియోగదారులు కాంగ్‌పోక్పిలోని కుకీ గ్రామాలపై మైతేయి కాల్పులు జరపడం ప్రారంభించారని ఆరోపించారు. రెండు వర్గాలు వేర్వేరు కోణాల్లో కాల్పుల దృశ్యాలను పంచుకున్నాయి.

కల్పనా చావ్లాలా కాకూడదనే: నాసా



న్యూఢిల్లీ: గతంలో ఏర్పడిన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకునే నాసా వ్యోమగాములైన ఇండో అమెరికన్ సునీతా విలియమ్స్‌తో పాటు బుచ్ విల్‌మోర్‌లను ఎనిమిది నెలల పాటు అంతరిక్ష కేంద్రంలోనే ఉంచాల్సి వస్తున్నట్టు ఉన్నతాధికారులు తెలిపారు. 2003లో భారత అమెరికన్ వ్యోమగామి కల్పనా చావ్లా, మరో ఆరుగురు స్పేస్‌షిప్ ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. 1986లో కూడా స్పేస్ షటిల్ ఛాలెంజర్ పేలిపోవడంతో 14 మంది వ్యోమగాములు మరణించారు. ఈ రెండు ఘటనలు పునరావృతం కాకూడదనే ఆలస్యమైనప్పటికీ విలియమ్స్, మరొకరిని సురక్షితంగా వెనక్కి రప్పించాలని అంతరిక్ష కేంద్రంలోనే ఉంచేశారు. 'ఈ రెండు ప్రమాదాలు మాపై తీవ్ర ప్రభావం చూపాయి. అందుకే ఐఎస్ఎస్ నుంచి సురక్షితంగా వారిద్దరినీ తీసుకురావడమే మా ప్రాధాన్యం' అని నాసా అధినేత బిల్ నెల్సన్ తెలిపారు. ఈ మిషన్‌కు సంబంధించి నాసా కొన్ని తప్పులు చేసిందని అంగీకరించిన ఆయన... వైఫల్యాలపై దర్యాప్తు జరుపుతున్నామ న్నారు.

హర్యానాలో కాంగ్రెస్ సరికొత్త ప్రచారం

చండీగఢ్: హర్యానా అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ వినూత్న ప్రచారానికి తెర తీసింది. 'ఖర్చే పే చర్చ' పేరిట ఎన్నికల ప్రచారానికి ఆ పార్టీ శ్రీకారం చుట్టింది. బీజేపీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ తరహా ప్రచారాన్ని కాంగ్రెస్ పార్టీ చేపట్టింది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతి నెల 'చాయ్ పే చర్చ' పేరిట రేడియోలో ప్రసంగిస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలో బీజేపీ పాలనలో ధరలు ఏ విధంగా ఉన్నాయి... తమ పార్టీ పాలనలో ధరలు ఎలా ఉన్నాయనే అంశాలను ప్రస్తావిస్తూ... ప్రచారాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకు వెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ చర్యలు చేపట్టింది. దశాబ్ద కాలంగా బీజేపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో పెరిగిన ధరలను పట్టిక రూపంలో రూపొందించి... ప్రజల మధ్యకు ఆ పార్టీ వెళ్తుంది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద ఈ పట్టికలు ఏర్పాటు చేస్తుంది. హర్యానా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ తేదీని అక్టోబర్ 5వ తేదీకి కేంద్ర ఎన్నికల సంఘం మార్చిన విషయం విదితమే. జమ్మూ కశ్మీర్ అసెంబ్లీతోపాటు హర్యానా అసెంబ్లీకి ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు మూడు విడతలుగా జరుగుతాయని, హర్యానా అసెంబ్లీ ఎన్నికలు ఒక విడతలో జరుగుతాయని ఎన్నికల సంఘం ఇప్పటికే జారీ చేసిన షెడ్యూల్‌లో వెల్లడించింది. ఈ ఏడాది అక్టోబర్ 2వ తేదీన బిష్ణోయ్ సామాజిక వర్గం వేడుకలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రాజస్థాన్, హర్యానాలోని ఆ వర్గం వారు ఆ వేడుకల్లో భారీ సంఖ్యలో పాల్గొంటారు. దీంతో అక్టోబర్ 1వ తేదీ పోలింగ్ కారణంగా... ఈ వేడుకలపై ఆ ప్రభావం పడుతుంది. ఇదే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి ఆ సామాజిక వర్గం పెద్దలు లేఖ రాశారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. అందులో భాగంగా హర్యానా అసెంబ్లీ ఎన్నికల తేదీని అక్టోబర్ 5వ తేదీకి మార్చింది. ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ అక్టోబర్ 8వ తేదీకి మార్చింది. హర్యానా అసెంబ్లీ ఎన్నికలతోపాటు జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు అదే రోజు చేపట్టనున్నారు.

ఇప్పుడు ఎన్నికలొస్తే 70 సీట్లూ మావే: సిసోడియా



న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సీనియర్ నేత మనీశ్ సిసోడియా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో ఇప్పటికిప్పుడు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే మొత్తం 70 స్థానాల్లో తమ పార్టీనే విజయం సాధిస్తుందని అన్నారు. రాజేంద్ర నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పాదయాత్ర చేపట్టిన మనీశ్ సిసోడియా బీజేపీపై మాటల దాడి చేశారు. తనను, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను తప్పుడు కేసుల్లో ఇరికించి... జైలులో పెట్టారని ఆరోపించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో తాను చేపడుతున్న ప్రచారంలో తనకు లభించిన అభిమానాన్ని సిసోడియా గుర్తు చేసుకుంటూ ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఆమ్ ఆద్మీ పార్టీ మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధిస్తుందని, మొత్తం ఓట్లలో 70 శాతం ఓట్లు సాధిస్తుందని వ్యాఖ్యానించారు. తాను ఏ తప్పు చేయలేదని, అందుకే జైలు నుంచి నవ్వుతూ బయటకు వచ్చానన్నారు. మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్ సహా అనేక ప్రభుత్వాలను బీజేపీ పడగొట్టిందని, తమ నాయకులపైకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)లను పంపడం ద్వారా పార్టీని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేసిందన్నారు. అయితే ఆమ్ ఆద్మీ పార్టీ ఏమాత్రం బెదరకుండా మరింత బలం పుంజుకున్నదని అన్నారు. అరవింద్ కేజ్రీవాల్ త్వరలోనే మన మధ్యకు వస్తారని ఆయన అన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలకుగాను 62 స్థానాల్లో ఆప్ విజయం సాధించింది. అయితే ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో ఆప్ ఖాతా తెరవలేకపోయింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి 17 నెలలు తీహార్ జైలులో గడిపిన మనీశ్ సిసోడియా ఈ నెల ప్రారంభంలో విడుదలయ్యారు.

రాజకీయాల్లోనూ 'క్యాస్టింగ్ కౌచ్': కాంగ్రెస్ నేత

తిరువనంతపురం: మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదిక మాలీవుడ్‌ను కుదిపేస్తోంది. ఈ కమిటీ తర్వాత ఎంతోమంది నటీమణులు మీడియా ముందుకు వచ్చి తమ చేదు అనుభవాలు, ఆవేదన పంచుకుంటున్నారు. ఈ పరిణామాల వేళ కేరళకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. 'క్యాస్టింగ్ కౌచ్' అనేది సినీరంగానికే పరిమితం కాలేదని, రాజకీయాల్లోనూ ఈ విపరీత పోకడ ఉందని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ కేరళ శాఖలో 'క్యాస్టింగ్ కౌచ్' తరహా పరిస్థితులు ఉన్నాయని సీనియర్ నాయకురాలు సిమీ రోజ్‌బెల్ జాన్ తీవ్ర ఆరోపణలు చేశారు. పార్టీలో చాలామంది మహిళలు... పురుష నేతల నుంచి అభ్యంతరకర ప్రవర్తనను ఎదుర్కొంటున్నారని తెలిపారు.

రెండు దశాబ్దాల తర్వాత

బుడమేరు ముంచేసింది

విశాలాంధ్ర - విజయవాడ (వన్‌టౌన్): రెండు దశాబ్దాల తర్వాత బుడమేరు వరదలో విజయవాడ నగరం మొత్తం మునిగిపోయింది. ఎన్‌టీఆర్ జిల్లా జీ కొండూరు మండలం వెలగలేరు వద్ద బుడమేరు రెగ్యులేటర్ సామర్థ్యాన్ని మించి వరద రావడంతో బుడమేరు పొంగి విజయవాడ నగరం మొత్తం నీట మునిగింది. రెండు రోజులుగా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పొంగిపొర్లుతున్న బుడమేరు డ్రెయిన్‌లోని అనేక ప్రాంతాలు ఆదివారం ఉదయం పూర్తిగా నీట మునిగాయి. మరోవైపు బుడమేరుకు అనేక చోట్ల గండు పడటంతో ఈ ప్రాంతాలన్నీ నీటమునిగినట్లు అధికారులు చెబుతున్నారు. వెలగలేరులోని రెగ్యులేటర్‌కు కొన్నాళ్లగా సరైన నిర్వహణ పనులు చేపట్టకపోవడం, సకాలంలో గేట్లు ఎత్తి వరద నీటిని నదిలోకి విడుదల చేయకపోవడం, బుడమేరు డ్రెయిన్ పొంగిపొర్లుతున్నప్పటికీ అధికారులు హెచ్చరికలు జారీ చేయకపోవడం పలితంగానే నగరం ముంపునకు గురైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బుడమేరు డ్రెయిన్‌కు 2005 తర్వాత అంతటిస్థాయిలో వరద పోటెత్తడం ఇదే తొలిసారి. ఆ సమయంలో విజయవాడ నగరపాలకసంస్థ సుమారు 10 డివిజన్ల ఎన్నికలను కూడా వాయిదా వేసింది. అప్పట్లోనూ శివారు ప్రాంతాలు ముంపునకు గురవ్వగా, ప్రజలను పడవలలో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. దాదాపు రెండు దశాబ్ధాల తర్వాత బుడమేరు డ్రెయిన్ పొంగిపొర్లడంతో అజిత్‌సింగ్ నగర్ ఫ్లైఓవర్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ), రైతు బజార్ పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. బుడమేరు డ్రెయిన్‌లోకి భారీగా ఇన్ ఫ్లో వస్తున్న దృష్ట్యా జి కొండూరు మండలం వెలగలేరు వద్ద బుడమేరు డ్రెయిన్ 11 హెడ్ రెగ్యులేటర్ గేట్లను ఎత్తి 30 వేల క్యూసెక్కుల వరద నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు.

భారీ వరద కారణంగానే ముంపు : స్పెషల్ డివిజన్ ఈఈ గంగయ్య

ఎగువ పరివాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బుడమేరు డ్రెయిన్ వరద ఒక్కసారిగా పెరిగిందని విజయవాడ స్పెషల్ డివిజన్ ఈఈ గంగయ్య తెలిపారు. అలాగే కోతుల వాగు, పులి వాగు తదితర వాగులు పొంగిపొర్లడంతో బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తోందని తెలిపారు. బుడమేరు డ్రెయిన్‌కు దాదాపు 30 వేల క్యూసెక్కుల వరద వచ్చిందని, అయితే వెలగలేరు వద్ద ఉన్న రెగ్యులేటర్ సామర్థ్యం 15,000 క్యూసెక్కులు మాత్రమేనని తెలిపారు. నదిలోకి 15 వేల క్యూసెక్కులను విడుదల చేయగా, మిగిలిన వరదను విజయవాడ సమీపంలోని ఎనికేపాడు వద్ద అండర్ టన్నెల్ వైపు విడుదల చేశామన్నారు. అయితే డిశ్చార్జి సామర్థ్యం కేవలం 10,000గా ఉండటంతో, పాయకాపురం, అజిత్ సింగ్ నగర్, దేవి నగర్, ప్రకాష్ నగర్, కండ్రిక, రాయనపాడు ప్రాంతాలు వరదలో మునిగిపోయాయని తెలిపారు. అంతేగాకుండా, ఏళ్ల తరబడి బుడమేరు పరివాహక ప్రాంతం ఆక్రమణకు గురికావడం, కట్టలు బలహీనంగా ఉండటంతో ముంపు సమస్య తలెత్తిందని చెప్పారు.

రైతు రుణాలు మాఫీచేయాలి

రైతు సంఘం నేతల డిమాండ్: రాష్ట్రవ్యాప్తంగా కోర్కెల దినం పాటింపు

విశాలాంధ్ర నెట్‌వర్క్: రైతు రుణ విమోచనచట్టం తీసుకురావాలనీ, రైతుల రుణాలన్నింటిని ఒక పర్యాయం మాఫీ చేయాలనీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు 50 శాతం గిట్టుబాటు ధరకు అదనంగా కలిపి మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యాన ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం కోర్కెల దినాన్ని పాటించారు. ఈ సందర్భంగా వాడవాడలా పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతాంగ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలని కోరారు. కర్నూలు జిల్లాలో 15 కేంద్రాలలో కోర్కెల దినాన్ని పాటించారు. కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, నందవరం, పెద్దకడుమూరు, కోసిగి, ఆదోని, ఆలూరు, ఆస్పరి, దేవనకొండ, పత్తికొండ, క్రిష్ణగిరి, వెల్దుర్తి తదితర ప్రాంతాల్లో డిమాండ్స్‌డే జయప్రదంగా నిర్వహించారు. పత్తికొండలోని కొండగేరిలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జెండాను సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.రామచంద్రయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతేరాజు- రైతే దేశానికి వెన్నెముక, రైతులేనిదే రాజ్యం లేదంటూ ఒకనాడు రైతన్నలను పాలకులు కీర్తించారనీ, కానీ నేడు రైతు అనే పదాన్ని మటుమాయం చేసే ప్రక్రియకు పాలకవర్గాలు శ్రీకారం చుడుతున్నాయని విమర్శించారు. 1936 ఏప్రిల్ 11న స్వామి సహజానంద సరస్వతి అధ్యక్షులుగా, ఆచార్య ఎన్‌జీరంగా ప్రధాన కార్యదర్శిగా "అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ఏర్పడిందనీ, నాటి బ్రిటీష్ పాలకులు దేశంలో రైతాంగ వ్యతిరేక విధానాలు అమలుచేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న దశలో కిసాన్‌సభ నాయకత్వం సెప్టెంబరు1 (1936)ని "డిమాండ్స్ డే" గా పాటించి ఆందోళనకు పిలుపు నిచ్చిందని చెప్పారు. నాటినుండి ఈనాటి వరకు కిసాన్‌సభ నేటి పాలకుల రైతాంగ విధానాలపై సమరశంఖం పూరిస్తూ రైతాంగాన్ని సమీకరించి అనేక విజయాలు సాధించిందని తెలిపారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి రాజా సాహెబ్, సీపీఐ, రైతు సంఘం నాయకులు, రైతులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గం మన్నీల గ్రామంలో కోర్కెల దినాన్ని నిర్వహించారు. సంఘం నియోజకవర్గ కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకటరాముడు అధ్యక్షతన రైతు సంఘం జెండా ఆవిష్కరణ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, ఉపాధ్యక్షుడు పి రామకృష్ణ హాజరై మాట్లాడుతూ, 2024 ఎన్నికల సందర్భంగా వ్యవసాయం సంబంధించి రూ ఇరవై వేలు పెట్టుబడి సాయం అందిస్తామని టీడీపీ ఇచ్చిన హామీ ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఖరీఫ్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా నేటికీ ప్రభుత్వం పెట్టుబడి సాయం గురించి మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి రామకృష్ణ, గిరిజన సంఘం రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు వై. ఎల్ రామాంజనేయులు, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, కార్యదర్శి బుల్లె నగేష్, నాయకులు నారాయణ స్వామి, పాలన్న, వెంకటరాముడు , సుబ్బారాయుడు , పెద్దన్న తదితరులు పాల్గొన్నారు. గుంతకల్ మండలం కొట్టాల గ్రామంలో హంద్రీనీవా కాల్వ దగ్గర రైతుసంఘం నియోజకవర్గ కార్యదర్శి రామాంజనేయులు యాదవ్ అద్వర్యంలో పతాకావిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సంఘం అనంతపురం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి గోవింద్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేశ్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి కుమ్మరి భాష, సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్ గోపీనాథ్, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ ఎం డి గౌస్, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ నాయకులు దేవేంద్ర, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఈశ్వరయ్య ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి మండల అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో రైతాంగ డిమాండ్స్ డేను పురస్కరించుకొని రైతు సంఘం సీనియర్ నాయకులు టి.సిహెచ్.చెన్నయ్య మొక్కలు నాటారు. కొనకనమిట్లలో జరిగిన కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పీవీ కొండయ్య, సిగనం వెంకటేశ్వర్లు, సిద్దయ్య, కె.కోటేశ్వరరావు, శ్రీను, గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు. నర్సీపట్నం మండలం గబ్బాడలో రైతు సంఘం పతాకావిష్కరణ జరిగింది.

ప్రతి ఒక్కరికీ న్యాయం

బుడమేరుపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం: చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని, ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు కాపాడటమే ప్రభుత్వ తక్షణ కర్తవ్యమని సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో వర్ష ప్రభావం, వాతావరణ పరిస్థితులపై హోంమంత్రి, సీఎస్, ఉన్నతాధికారులతో ఆదివారం తాడేపల్లిలోని ఏపీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో సీఎం సమీక్షించారు. తుపాన్ ప్రభావం, వర్షపాతం నమోదు అంశాలు సీఎంకు సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ వివరించారు. వరద ఉధృతి ఎక్కడెక్కడ ఉందన్నదానిపై సీఎం ఆరా తీశారు. ప్రకాశం బ్యారేజీ దిగువ ప్రాంతాల్లో తీసుకున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. బుడమేరు ముంపు ప్రాంతాల గురించి ఆరా తీశారు. వరద ప్రవాహం వివరాలు తెలుసుకున్న అనంతరం తాజా వర్షాలు ఓ పాతంగా అధికారులు అధ్యయనం చేయాలని సూచించారు. ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఒక్కబాధితుడికి సాయం అందించాలని, సహాయక చర్యల్లో ప్రజలూ భాగస్వాములు కావాలని కోరారు. జలాశయాలన్నీ దాదాపు నిండిపోయాయని, దీంతో వాగులు, చెరువులకు నీరు వెళ్లే దారిలో సత్వర చర్యలు చేపట్టాలని, సాధారణ పరిస్థితులు నెలకొనేవరకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. భారీవర్షాలకు రాష్ట్రం అతలాకుతలమైంది. ఎప్పుడూ చూడనంత వర్షపాతం నమోదైంది. పకడ్బందీ పర్యవేక్షణ వల్ల చాలా వరకు మరణాల సంఖ్య తగ్గించగలిగామని, ఒకేచోట కొండచరియలు విరిగిపడి ఐదుగురు చనిపోవడం, ఇంకో చోట ముగ్గురు వాగులో కొట్టుకుపోవడం, మంగళగిరిలో 80 యేళ్ల వృద్ధురాలు కొండరాళ్లు పడి చనిపోవడం దురదృష్టకరమని చంద్రబాబు అన్నారు. బుడమేరు నుంచి నేరుగా కొల్లేరు సరస్సుకు వెళ్లాల్సిన నీరు విజయవాడపై పడిందని, దీనిని పరిష్కరించేందుకు అన్ని రకాల ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కలెక్టర్లను అప్రమత్తం చేశాం. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఐదేళ్లల్లో బుడమేరు ఛానల్‌ను సరిచేయకపోవడం వల్ల దాని పర్యవసానం వీటీపీఎస్, విజయవాడ నగరం ముంపునకు గురయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రకాశం బ్యారేజీకి 10 లక్షలు లేదా అంతకు పైగా క్యూసెక్కుల నీరు వస్తే ఎలా ఎదుర్కోవాలన్నదే తమ తక్షణ కర్తవ్యమని సీఎం వెల్లడించారు.

కలెక్టరేట్‌లోనే చంద్రబాబు మకాం

బుడమేరు ప్రాంతంలో సాధారణ పరిస్థితి నెలకొనే వరకు ఎన్టీఆర్‌జిల్లా కలెక్టరేట్ కేంద్రంగా సీఎం చంద్రబాబు మకాం వేసి సమీక్షలతో బిజీబిజీగా ఉన్నారు. ఆదివారం సాయంత్రం కనకదుర్గ వారధి దగ్గర కొద్దిసేపు ఆగి కృష్ణానదీ ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం సింగ్‌నగర్ బుడమేరు ముంపు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అక్కడి నుంచి తిరిగి ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌కు చంద్రబాబు చేరుకున్నారు. అక్కడ మంత్రులు, ఉన్నతాధికారులతో చంద్రబాబు సమీక్షలో బిజీబిజీగా నిమగ్నమయ్యారు. వరద బాధితుల కష్టాలు తీర్చే వరకు శ్రమించాలని, లక్ష మందికి సరిపోయే ఆహారం సరఫరా చేయాలని, ఇతర ప్రాంతాల నుంచి అదనపు బోట్లు, టాక్టర్లు తక్షణం తెప్పించాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. విజయవాడలో ఉన్న అన్ని షాపుల నుంచి వాటర్ బాటిళ్లు తెప్పించాలని సూచించారు. బుడమేరులో ఊహించని స్థాయి వరదతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, సాయంలో ప్రతి రెండు గంటలకు మార్పు కనిపించాలన్నారు. ఖర్చు గురించి ఆలోచించవద్దని అధికారులను ఆదేశించారు. బాధితులకు క్యాండిళ్లు పంపిణీ చేయాలన్నారు. కాగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఫోన్లో సీఎం చంద్రబాబు మాట్లాడారు. రాష్ట్రంలో వరద సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్ ద్వారా పవర్ బోట్లు పంపాలని కోరారు. వరద సహాయక చర్యలపై అవసరమైన సాయం చేస్తామని అమిత్‌షా హామీ ఇచ్చారు. హోంశాఖ కార్యదర్శి ద్వారా తక్షణం సహాయం అందేలా చేస్తామని చెప్పారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విరమించుకోవాలి

ఓబులేసు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ యోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని, దానిని ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం నుంచి విశాఖ స్టీల్ సిటీలో ప్రారంభమైన ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాల్లో ఆయన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 2021 ఫిబ్రవరిలో విశాఖ స్టీల్ ప్లాంట్‌లో వంద శాతం విక్రయించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. ముడి సరుకు, నిధులు రాకుండా చేసి పరిశ్రమను నష్టాల పాలు చేసి విక్రయించడానికి ప్రయత్నాలు చేస్తోంది. దీనికి వ్యతిరేకంగా స్టీల్ ప్లాంట్ కార్మికులు గత 1298 రోజుల నుంచి అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. ముఖ్యంగా విశాఖ స్టీల్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ గుర్తింపు యూనియన్) రెండున్నరేళ్లుగా అన్ని యూనియన్‌లను కలుపుకొని వీరోచితంగా పోరాడుతోంది. స్టీల్ ప్లాంట్‌లో వంద శాతం ఈక్విటీ పెట్టుబడుల ఉపసంహరణ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, అలాగే కంపెనీ క్లిష్ట పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఆర్ఐఎన్ఎల్ మనుగడ, సుస్థిరత కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. దీనిలో భాగంగా ఆర్ఐఎన్ఎల్ వంద శాతం వ్యూహాత్మక విక్రయ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను మళ్లీ సెయిల్‌లో విలీనం చేయాలి. కేంద్ర ప్రభుత్వం ద్వారా రుణాలు ఇవ్వడం, మూడు సంవత్సరాల పాటు పన్ను సెలవు ప్రకటించడం, ప్లాంట్ సామర్థ్యం స్థిరీకరించే వరకూ ఆర్థిక సహాయం అందిస్తుండటం, ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయడం, కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచడం, క్యాప్టివ్ ఇనుప ఖనిజం గనుల కేటాయింపు కోసం సెయిల్ లేదా ఎన్ఎండీసీ నుంచి ముడి సరుకు సరఫరా చేయడం వంటి చర్యలు తీసుకోవాలని ఓబులేసు డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలో ఆర్ఐఎన్ఎల్‌ను కాపాడేందుకు జరుగుతున్న ప్రజాందోళనకు ఏఐటీయూసీ నిరంతర మద్దతు కొనసాగిస్తుందని ప్రకటించారు.

జేడీ(యూ) అధికార ప్రతినిధి కేసీ త్యాగి రాజీనామా

రాజీవ్ రంజన్ నియామకం

న్యూఢిల్లీ: బీహార్‌లో అధికారంలో ఉన్న జనతాదళ్ (యునైటెడ్) సీనియర్ నాయకుడు కేసీ త్యాగి ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ నాయకత్వానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. సీఎం నితీశ్ కుమార్ పార్టీ ఆదివారం ఈ విషయాన్ని తెలిపింది. త్యాగి స్థానంలో రాజీవ్ రంజన్ ప్రసాద్‌ను పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా నియమించనున్నట్లు ప్రకటించింది. ఇతర పనుల్లో నిమగ్నమై ఉండటం వల్ల ప్రతినిధిగా న్యాయం చేయలేకపోతున్నానని నితీశ్‌కు రాసిన లేఖలో త్యాగి వెల్లడించారు. త్యాగి, 'రాజకీయ సలహాదారు' గా తన మరో పాత్రలో కొనసాగుతారని పార్టీ నాయకులు తెలిపారు. కాగా, ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ), వక్ఫ్ (సవరణ) బిల్లు, పాలస్తీనా సమస్య వంటి అనేక ఇతర అంశాలలో బీజేపీకి భిన్నంగా జేడీ(యూ) వైఖరిని వెల్లడిస్తూ ఆయన పార్టీలో అలజడి సృష్టించారు. ఇజ్రాయిల్‌కు ఆయుధాల సరఫరాను నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. అలాగే గాజాలో శాంతి, కాల్పుల విరమణకు భారత్ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. అయితే పార్టీ నాయకత్వాన్ని సంప్రదించకుండానే త్యాగి ఈ ప్రకటనలు చేసినట్లు జేడీ(యూ) విమర్శించింది. ఆయన వ్యాఖ్యల కారణంగా ఎన్‌డీఏలో విభేదాలు తలెత్తినట్లు ఆ పార్టీ వర్గాలు ఆరోపించాయి. ఈ నేపథ్యంలో జాతీయ అధికార ప్రతినిధి పదవికి కేసీ త్యాగి రాజీనామా చేసినట్లు తెలుస్తున్నది.

అర్ధరాత్రి ఉక్రెయిన్ దాడి... 158 డ్రోన్లు కూల్చిన రష్యా

మాస్కో: రష్యా, ఉక్రెయిన్ మధ్య డ్రోన్ల యుద్ధం కొనసాగుతోంది. మాస్కో సహా అనేక ప్రాంతాలు లక్ష్యంగా దూసుకొచ్చిన 158 ఉక్రెయిన్ డ్రోన్లను సమర్థవంతంగా కూల్చేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. మాస్కో సహా మరో తొమ్మిది ప్రాంతాలపై అర్ధరాత్రి వేళ ఈ దాడులు జరిగినట్లు తెలిపింది. ఇందులో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని వివరించింది. యుద్ధం మొదలైన తర్వాత ఉక్రెయిన్ జరిపిన అతిపెద్ద డ్రోన్ దాడుల్లో ఇది ఒకటని అధికారులు వెల్లడించారు. ఉక్రెయిన్ సరిహద్దుల్లో ఉన్న కుర్స్క్, బ్రయాన్స్క్, వొరోనెజ్, బెల్గొరోడ్ ప్రాంతాల్లో 122 డ్రోన్లు కూల్చినట్లు రష్యా అధికారులు తెలిపారు. బ్రయాన్స్క్ ప్రాంతం భూభాగంపై భారీ యూఏవీ డ్రోన్‌ను తమ దళాలు తప్పి కొట్టాయని ప్రాంతీయ గవర్నర్ అలెగ్జాండర్ బోగోమాజ్ వెల్లడించారు. మూడు డ్రోన్లు కషీరా బొగ్గు ఆధారిత పవర్ స్టేషన్‌ను ఢీకొట్టేందుకు ప్రయత్నించాయని స్థానిక అధికారి తెలిపారు. అయితే ఎటువంటి నష్టం జరగలేదన్నారు. ఈ దాడుల కారణంగా నగర సరిహద్దులోని బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్ దెబ్బతిన్నట్లు తెలిపారు. రష్యా వార్తా సంస్థలు సైతం ఈ విషయాన్ని ధృవీకరించాయి. బెల్గొరోడ్‌లో మూడు నివాస భవనాల్లోని అద్దాలు దెబ్బతినగా, ఒక ప్రైవేటు నివాస యుటిలిటీ భవనం పూర్తిగా ధ్వంసమైందని స్థానిక గవర్నర్ వ్యాచెస్లావ్ గ్లాడ్కోవ్ తెలిపారు.

బుడమేరు ముంపు దృశ్యాలు

విజయవాడలో వరద ముంచెత్తడంతో సురక్షిత ప్రాంతాలకు తరలింపు

వరదనీటిలో కబేళా సెంటర్

వెలగలేరులో బుడమేరు ఉగ్రరూపం

నూజివీడులో పెద్దచెరువుకు గండి

సింగ్‌నగర్‌లో నీట మునిగిన కార్లు

సీతార సెంటర్‌లో పడవల ద్వారా బాధితులకు ఆహారం పంపిణీ చేస్తున్న సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు, కార్యకర్తలు

నీట మునిగిన నివాస ప్రాంతం

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.